మీకు మేమున్నాం..



కూటమి నాయకులు ప్రజలతో మమేకం అవుతున్నారు.. కష్టం వచ్చిందని ఎవరైనా వస్తే అక్కున చేర్చుకుంటున్నారు.. సమస్య తెలుసుకుని పరిష్కారానికి పాటు పడుతున్నారు.. ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. అనపర్తిలో ఎంపీ పురందేశ్వరి ఒక దివ్యాంగ యువతి సమస్యలు విన్నారు.. ధవళేశ్వరం ఎమ్మెల్యే గోరంట్ల సమస్యలు విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.





దొమ్మేరులో వడగళ్ల వాన

కురిసింది వాన



హైవేలో తడిచిన ధాన్యంపై బరకం కప్పుతున్న రైతులు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు అకాల కష్టం వచ్చి పడింది. చేతివరకూ వచ్చిన పంట నోటి వరకూ అందే పరిస్థితి కానరావ డంలేదు.. అకాల వర్షాలు అన్నదాతను ముంచుతున్నాయి. కొవ్వూరు పట్టణ, మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వడగళ్ళ వర్షం కురిసింది. దీంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు.. రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యపురా శులు తడిచి పోవడంతో రైతులు లబో దిబోమన్నారు.సుమారు గంటకు పైగా వర్షం కురవడంతో జనజీవనం స్తం భించింది. వర్షంతో పాటు చిన్న చిన్న ఐస్ ముక్కలు పడుతుండడంతో చిన్నారులు వాటిని చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు.



కాలువలు మూసివేస్తారా.. నీటి విడుదల పొడిగిస్తారా!

ధవళేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డెల్టా కాలువలు మూసివేస్తారా.. లేక నీటి విడుదల పొడిగిస్తారా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. రబీ అనంతరం ఖరీఫ్ సీజన్‌లో నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు క్లోజర్ పనులు చేపట్టేందుకు డెల్టా కాలువలను బుధవారం నుంచి మూసివేయాలని ఇరిగేషన్ అధికారులు గతంలోనే నిర్ణయించారు. అయితే శివారు ఆయకట్టు భూములకు ఇంకా నీటి అవసరత ఉండడం, గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడం తదితర పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. రబీ అవసరాలు తగ్గిన తరువాత గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి మరో నాలుగైదు రోజులు కాల్వలకు నీరు విడుదల చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఎటువంటి సమాచారం లేదు.

నేడు కాలువలు మూసివేస్తాం.. సర్కిల్ ఎస్ఈ గోపినాథ్

డెల్టా కాల్వలను నిర్ణయించిన తేదీ మేరకు బుధవారం నుంచి మూసివేయనున్నాం. కాల్వలకు నీటి విడుదల పొడిగింపునకు ఎటువంటి అభ్యర్థనలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇంత వరకు అందలేదు. కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేయాలని నిర్ణయించడంతో కాల్వలను మూసివేసేందుకు ఇరిగేషన్ సిబ్బంది సిద్ధంగా ఉండాలి.

ఏపీ పీజీసెట్, ఐసెట్‌కు ఉచిత కోచింగ్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్, ఐసెట్ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తరపున ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉచిత కోచింగ్ బ్రోచర్ ఆవిష్కరించారు. పీజీ కోచింగ్ కోఆర్డినేటర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ పూర్తి సమాచారం కోసం కళాశాల అధికారిక వెబ్‌సైట్ జీసీఆర్‌జేవై.ఏసీ.ఇన్ సందర్శించాలన్నారు.

పెడితే.. తిరిగి రాధే!



"హాయ్..మీకో బెట్టింగ్ యాప్ చెబుతా.. తెలి సిన వారి ద్వారా ఇందులో పందేలు కాయిస్తే వచ్చిన లాభాల్లో 10 శాతం మీకే.. ఇదిగో యాప్ లింకు.. యూజర్ ఐడీ.. పాస్‌వర్డ్.. మీరే కాదు... మీకు నచ్చినంత మందికి ఇవి షేర్ చేసి ఎంత మందితో ఆడిస్తే అంత లాభాలు" అంటూ కాకినాడకు చెందిన మణికుమార్ అలియాస్ పండు సొంతంగా తయారుచేసిన 'రాధే' అనే బెట్టింగ్ యాప్‌తో రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది బుకీలు, సబ్ బుకీలను నియమించుకున్నాడు.. పోలీసులకు తెలిస్తే తక్షణమే యాప్‌లో అత్యవసర బటన్ ఏర్పాటు చేశాడు.. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కోట్లు లాగేశాడు.



కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరుడు ఘాజీ (పేరు మార్చాం). గడచిన అయిదేళ్లలో కాకినాడ నగరం కేంద్రంగా పేకాట, బెట్టింగ్ యాప్‌లతో సంపాదించింది అక్షరాలా రూ.70 కోట్లు పైమాటే.. రాత్రయితే నగరంలో ప్రముఖులకు ఖరీదైన బస కల్పించి బెట్టింగ్‌లు ఆడించి తెగ నొల్లేశాడు. ప్రభుత్వం మారాక కూడా కొనసాగిస్తుండగా డెన్ బయటపడి ఇప్పుడు రహస్యంగా ఇళ్లల్లో జూదం, బెట్టింగ్ యాప్‌లు ఆడిస్తున్నాడు. అటు పండు అయినా.. ఇటు ఘాజీ అయినా వీరిద్దరి ఘరానా బెట్టింగ్ నిర్వాహకుల తెరవెనుక వెన్నుదన్ను కాకినాడ వైసీపీ కీలక నేతే. ఇటీవల పండు వరంగల్‌లో పట్టుబడితే అక్కడ మంత్రికి ఫోన్ చేసి కేసు నీరుగార్చేలా చేశాడు. - కాకినాడ/ ఆంధ్రజ్యోతి)

కాకినాడలో గతంలో ఎక్కడా బెట్టింగ్‌ల వ్యాపారం పెద్దగా జరిగేది కాదు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా బెట్టింగ్‌లు భారీగా పెరిగిపోయాయి. పై రెండు ఉదాహరణలు చాలు కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా ఏ స్థాయిలో వేళ్లూనుకు పోయిందో చెప్పడానికి. ఇక్కడి నుంచే వీరిద్దరు కాకుండా అచ్చం వీళ్ల తరహాలో అనేకమంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్‌లో రమ్మీ, క్రికెట్ బెట్టింగ్, కేసినోలు ఆడిస్తూ వేలాది మంది డబ్బు జూదంలో పోగొట్టుకోగా, వీరు మాత్రం కోట్లకు పడగలెత్తారు.

మనీకుమార్..మాయాజాలం

- కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా
- యాప్ తయారు చేయించి కోట్లలో జూదం
- పందేలు కట్టిస్తే లాభాల్లో 10 శాతం వాటా
- బుకీలు, సబ్‌బుకీలు నియామకం
- రాధే ఎక్సేంజ్ యాప్ ద్వారా కోట్లు
- దందాకు వైసీపీ కీలకనేత అండదండలు
- తీగలాడితే కదిలిన పండు డొంక

బెట్టింగ్ యాప్‌ల కేరాఫ్ కాకినాడ..

తీగలాగితే డొంక కదిలింది.. కాకినాడ కేంద్రంగా సాగే బెట్టింగ్ ముఠా బయటపడింది. కాకినాడ నగరానికి చెందిన పండు ఏకంగా సొంతంగా రాధే ఎక్సేంజ్ బెట్టింగ్ యాప్ తయారుచేసి అనేక రాష్ట్రాల్లో బుకీలు, సబ్‌బుకీలను నియమించుకుని కోట్లకు పడగలెత్తాడు. ఇటీవల వరంగల్‌లో దొరికిన బెట్టింగ్ బాబులను లోతుగా విచారిస్తే కాకినాడ కేంద్రంగా పండు సాగించిన బెట్టింగ్ మాఫియా బయటపడింది. దీంతో పండును అరెస్ట్ చేసి విచారిస్తే పండు ఖాతాలో రూ.5 కోట్లు గుర్తించారు. ఇదంతా బెట్టింగ్ ద్వారా సంపాదించినదేనని తేల్చారు. తాజాగా కృష్ణా జిల్లాలోను పట్టుబడ్డ బుకీలను విచారిస్తే అక్కడా సదరు పండు పేరే బయటకు రావడంతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేయబోతున్నారు. అయితే అటు తెలంగాణ, ఇక్కడ కృష్ణాలో పట్టుబడ్డ బెట్టింగ్‌బాబులను అరెస్ట్ చేసి ప్రశ్నిస్తే కాకినాడ కేంద్రంగా వెలుగు చూస్తున్న బెట్టింగ్ దందా చూసి పోలీసులే నివ్వెరపోయి నోరెళ్లబెడుతున్నారు. దీంతో ఇప్పుడు బెట్టింగ్ యాప్‌ల తీగ లాగితే డొంక కాకినాడలో తేలుతుండడంతో పోలీసులంతా అవాక్కవుతున్నారు.

ఐదేళ్లు.. రూ.70 కోట్లు కమీషన్..

కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరులు కొందరు ఇళ్లు అద్దెకు తీసుకుని పేకాట నిర్వహించేవారు. కొన్ని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు సదరు నేత కీలక అనుచరుడు నగరంలో జూదరులకు పరిచయం చేశాడు. వారి ద్వారా ఈ యాప్‌ల్లో రోజుకు రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు కూడా పందేలు కాయించేవారు. సదరు వైసీపీ కీలకనేత అనుచరుడికి కమీషన్లు భారీగా రావడంతో రెచ్చిపోయి వ్యాపారం పెంచేశాడు. గడచిన ఐదేళ్లలో సదరు వ్యక్తి పేకాట నిర్వహణ, యాప్‌ల కమీషన్ ద్వారా రూ.70 కోట్ల వరకు సంపాదించాడు. ఇందులో రూ.14 కోట్లతో నగరంలో ఇటీవల ఖరీదైన భవంతిని నిర్మించాడు. అయితే బెట్టింగ్‌ల విషయం తెలిసినా పోలీసులు జోలికిరాకుండా ఉండేందుకు నెలకు లక్షల్లో మామూళ్లు పంపాడు. కొంతకాలం కిందట ప్రభుత్వం మారాక తిరిగి పేకాట ఆడించేందుకు ప్రయత్నించగా దొరికిపోవడంతో ఇప్పుడు యాప్‌ల ద్వారా జూదం కొనసాగిస్తున్నాడు. ఇప్పటికీ ఐపీఎల్, ఇతర క్రికెట్ మ్యాచ్‌లు వస్తే సదరు వ్యక్తి కోట్లలో యాప్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు. ఇటీవల మళ్లీ నగరంలో పలు ఇళ్లను అద్దెకు తీసుకుని యథేచ్ఛగా పేకాట, ఇతర జూదం ఆడిస్తున్నాడు. పోలీసులకు విషయం ముందే చెప్పి మామూళ్లు పంపేస్తున్నాడు.

కోట్లు 'పండు'లా రాలుతున్నాయి..

సదరు ఘాజీతో జూదంలో పరిచయాలు ఉన్న కాకినాడకు చెందిన వీరమణికుమార్ అలియాస్ పండు బెట్టింగ్‌ను వ్యాపారంగా మార్చేశాడు. కాకినాడ కేంద్రంగా రాధే ఎక్సేంజ్ బెట్టింగ్ యాప్ తయారు చేశాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తెలంగాణ వరకు ఈ యాప్‌ను అనేక మంది బుకీలు, సబ్ బుకీలకు పరిచయం చేశాడు. యాప్‌లో జూదం ఆడిస్తే వచ్చిన లాభాల్లో పది శాతం కమీషన్ ఎర చూపాడు. వీరందరికి యాప్ లింకు, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందించాడు. వీరంతా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విస్తరించేలా చేశాడు. అందులో భాగంగా తను తయారు చేసిన బెట్టింగ్ యాప్‌నకు కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కిరణ్‌కుమార్‌ను అడ్మిన్‌గా నియమించాడు. సదరు అడ్మిన్ పది శాతం కమీషన్ ఆశతో బుకీలు,సబ్ బుకీలను నియమించాడు. కిరణ్ ఇటీవల పోలీసులకు దొరికిపోడంతో పండు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. వరంగల్‌లో పోలీసులకు చిక్కిన కొందరు బుకీలు ఇచ్చిన సమాచారంతో పండు అసలు సూత్రధారుడిగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి బెట్టింగ్ యాప్ ద్వారా వచ్చిన రూ.5 కోట్ల లాభం ఖాతాలో గుర్తించారు. ఇందులో కోటితో ఇటీవల కాకినాడలో ఓ అపార్ట్ మెంట్ కొనుగోలు చేశాడు. అయితే పండు అరెస్ట్‌తో అవాక్కయిన కాకినాడ వైసీపీ కీలకనేత అక్కడ తన పాత పరిచయాలతో ఆ మంత్రితో మాట్లాడి కేసులోతుల్లోకి వెళ్ల కుండా ప్రయత్నాలు చేశారు. సదరు పండు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది బుకీలతో ఇప్పటికీ జూదం ఆడిస్తున్నాడు. సదరు పండు యాప్ ద్వారా రూ.40 కోట్ల వరకు సంపాదించినట్టు సమాచారం. కానీ పోలీసులు ఇదెక్కడా పెద్దగా పట్టించుకోవడంలేదు. వరంగల్‌లో అరెస్టయిన సదరు పండును ఇక్కడా విచారిస్తే ఉమ్మడి జిల్లాలో అనేక ఘోరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ దిశగా పోలీసులు అడుగులు వేస్తారని అనుకోలేం.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి



కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగుల్లో అప్పులపాలై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు మండలం పెనకనమెట్టకు చెందిన తాడి వినోద్ (30) ఒరామి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే వర్క్ ఫ్రం హోం పనిచేస్తున్నాడు. ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లో రూ.లక్ష పోగొట్టుకోవడంతో తండ్రి వెంకటేశ్వరరావు మందలించాడు. బెట్టింగ్ గేమ్‌లలో అప్పుల పాలవ్వడంతో ఈనెల 14వ తేదీన కలుపుమందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం అక్కడ నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ బాబూరావు తెలిపారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు, రెవెన్యూ అధికారులు, రైతులు

పారదర్శకంగా భూ రీసర్వే

చిన్నాయిగూడెం అవగాహన ర్యాలీలో జేసీ చిన్నరాముడు

దేవరపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో మూడు గ్రామాల్లో రీసర్వేను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని సమగ్రంగా రీసర్వే నిర్వహించడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. చిన్నాయిగూడెంలో గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీసర్వే పనులకు రైతులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రతి రైతుకు 19 నోటీసులు జారీ చేయడం జరుగుతుందని.. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వేలో అభ్యంతరాలేమైనా ఉంటే మండల సర్వేయర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చిన్నాయిగూడెంలో 5 వేల ఎకరాల భూమి ఉందని దీనిలో జమిందారుభూమి కావడం వల్ల అన్ని కోణాల్లో పరిశీలించి సర్వే చేయడం జరుగుతుందన్నారు. రైతులకు సంబంధించి 5 సెంట్లు పైబడి తేడాలుంటే సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. అడంగళ్ ,పట్టాదారు పాస్‌పుస్తకం, డాక్యుమెంట్ ఆధారాలతో రీసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతు చిలకా రాజేశ్ మాట్లాడుతూ తనుకు మూడు ఎకరాలన్నర డాక్యుమెంట్ ఉందని.. భూమి ఎకరం 70 సెంట్లు మాత్రమే ఉందని రీసర్వేలో ఎక్కడుందో గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు. రైతు మాజీ ఏఎంసీ చైర్మన్ గడా మురళి అజిత్‌కుమార్ మాట్లాడుతూ చిన్నాయిగూడెంలో పాలేటి వాగు భూమి ఒక వైపు ఉంటే నీరు ప్రవాహం రైతు పొలాల మీదుగా వెళతుందని భూమి రీసర్వే చేసి రైతు పొలాల మీదుగా కాకుండా వాగు ద్వారా వెళ్లేలా చర్యలు చేపట్టాలని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో రీసర్వే అవగాహన ర్యాలీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ నారాయణ, ఐఎస్‌వో వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్,సర్పంచ్ డి.జ్యోతిరాణి, రైతులు పిన్నమనేని మధుమోహన్, అబ్బిన సురేంద్ర, గడా రామనరసింహారావు, కాట్రగడ్డ శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ పాడారు.. ఇక్కడ ఇచ్చేశారు!

భూ వేలంలో మాయాజాలం

రాజానగరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అన్నదాన సత్రం భూముల్లో పంటల సాగు బహిరంగ వేలంలో పలువురు సిండికేట్ అయ్యారు.రాజానగరంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన(ఫీడింగ్)సత్రం అధీనంలో తూర్పుగోనగూడెంలో ఉన్న 25.16 ఎకరాల్లో పంటలు పండించుకునేందుకు దేవాదాయ ధర్మాదాయ తనిఖీదారు టీవీఎస్ఆర్ ప్రసాద్, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు గ్రామ పెద్దలు, పాటదారుల సమక్షంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. 25.16 ఎకరాలను ఐదు బిట్లుగా బహిరంగ వేలం నిర్వ హించారు. సర్వే నంబరు 20లో ఉన్న 2.87 ఎకరాలు భూమిలో పంట సాగుకు సాలుకు లక్షా వెయ్యి రూపాయలు,సర్వే నెంబరు 27లో 5.48 ఎకరాలు రూ.లక్షా 5 వేలుకు, సర్వే నెంబరు 28లో 6.99 ఎకరాలను రూ.లక్షా 30 వేలకు, సర్వే నెంబరు 135లో ఉన్న 4.91 ఎకరాలను రూ.90 వేలకు రాజానగరానికి చెందిన గుర్రం శ్రీనివాసరావు పాడుకున్నారు. సర్వే 135లో ఉన్న మరో 4.91 ఎకరాలను సూర్యారావుపేటకు చెందిన పిడుగు సురేష్ రూ.90 వేలకు దక్కించుకున్నారు. దీంతో 25.16 ఎకరాలు ఏడాదికి రూ.5.16 లక్షలు వంతున మూడేళ్ల పాటు పంటలు పండించుకునేందుకు మొత్తం రూ.15.48 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో సురేష్‌బాబు తెలిపారు. బహిరంగ వేలంలో రూ.15.16 లక్షలు వంతున పాడుకున్న కూటమి నాయకులు సిండికేట్‌గా మారి సాలుకు 11 లక్షలు వంతున ఇతర వ్యక్తులకు కట్టబెట్టి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు వైసీపీకి చెందిన నాయకులు ఆరోపించారు.

ధాన్యం తక్కువ ధరకు అమ్మవద్దు

ఎంపీ పురందేశ్వరి

బిక్కవోలు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మి రైతులు పోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి రైతులకు సూచించారు.కొమరిపాలెం రైతు సేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించిన విధంగా త్వరలో బిక్కవోలు రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రూ.6 కోట్లతో కెనాల్ రోడ్ మరమ్మతు పనులు చేపట్టామని, మరో రూ.4.50 కోట్లతో పనులు చేపడతామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అన్ని వర్గాలు ఆనం దంగా ఉన్నాయన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎంపీపీ తేతలి సుమ, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, శివరామకృష్ణంరాజు, చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వెదుళ్లపల్లి సొసైటీలో విచారణ మాటేమిటి

సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో నిలదీసిన రైతులు

సీతానగరం,ఏప్రిల్ 15 : వెదుళ్ళపల్లి సొసైటీలో అవినీతిపై విచారణ ఎంత వరకు వచ్చిందని రైతులు ప్రశ్నించారు. సీతానగరం మండలం వెదుళ్ళపల్లి సహకారం సంఘం సర్వసభ్య సమావేశంలో మంగళవారం రైతులు మాట్లాడారు. 2018 ఏప్రిల్ నుంచి సంఘంలో ఆడిట్ చేసిన అధికారులు దుర్వినియోగమైన నగదుపై విచారణాధికారులుగా వద్దని కొత్తవారిని నియమించాలని తీర్మానించారు. గతంలో అవినీతికి పాల్పడిన సీఈవో సురేంద్ర, గుమస్తా పోశియ్య, భారతిలను సస్పెండ్ చేసి ఎరువుల అమ్మకాల్లో అవినీతికి పాల్పడిన భారతిని ఇప్పుడెలా విధుల్లోకి తీసుకున్నారని ప్రశ్నించారు. రుణాలు చెల్లించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలి కదా .. విచారణ సాగదీస్తుంటే రైతులకు న్యాయమెలా జరుగుతుందంటూ కరుటూరి విశ్వనాథం, పెందుర్తి రాజా, పెందుర్తి బుజ్జియ్య చౌదరి ప్రశ్నించారు.సహకార సంఘం అధ్యక్షుడు ఎం సోమయ్య మాట్లాడుతూ సిబ్బంది జీతాలు అంత ఎక్కువగా ఎందుకు పెంచారని ప్రశ్నించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మాట్లాడుతూ సంఘంలో 400 మంది సభ్యులు ఉన్నారని అందులో 45 మంది రైతులు తీసుకున్న రుణాల చెల్లింపులో నకిలీ రసీదులు సస్పెండైన అప్పటి సీఈవో ఇచ్చారని దీనిపై రూ 14 లక్షలు దుర్వినియోగమైనట్టు తేలిందన్నారు. విచారణ గడువు వచ్చే నెల 12వ తేదీ వరకు ఉందన్నారు. గతంలో రూ.64 లక్షలు దుర్వినియోగం తిరిగి రూ.57 లక్షలు చెల్లించారని ఇంకా రూ.7 లక్షల చెల్లించాల్సి ఉందన్నారు. రైతులకు అందించిన నకిలీ రసీదులపై రికార్డులు పరిశీలించగా రూ.14 లక్షలు దుర్వినియోగమైనట్టు గుర్తించామని.. ఇంకా రైతుల రుణాల చెల్లింపులపై విచారణ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విచారణాధికారి శివ కుమార్, ఆడిటర్ కె.సుబ్బారావు ,సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 8 నుంచి 14 సంవత్సరాల వయసున్న 25 మంది బాలురు, 25 మంది బాలికలకు వివిధ క్రీడాంశాల్లో వేసవి క్రీడాశిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రీడా శిక్షణా శిబిరాలు మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఆసక్తికల్గిన క్రీడాకారుల దరఖాస్తులను ఆయా క్రీడల జిల్లా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామోపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు అందజేయాలని కోరారు. గురువారంలోపు రాజమహేంద్రవరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయానికి నేరుగా కానీ, ఈమెయిల్ ద్వారా కానీ పంపించాలన్నారు. వివరాలకు సెల్ 90329 34038లో సంప్రదించాలన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

చాగల్లు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బాలికను నమ్మించి మోసగించిన యువకుడిని అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. బ్రాహ్మణగూడెంనకు బాలిక (15)పై అదే గ్రామానికి చెందిన శీలం సిద్దార్థ చంద్ర అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసినట్టు బాధితురాలి తల్లి ఈ నెల 10వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు చాగల్లు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు శీలం సిద్దార్థ చంద్రను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు.



కందుకూరి వీరేశలింగం తైలవర్ణ చిత్రం

(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

సంఘ సంస్కర్త.. యుగ పురుషుడు

వీరేశలింగం



రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులు పరిశోధనా కేంద్ర భవనం

వివిధ సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడు, గొప్ప సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, యుగ పురుషుడు, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆయన గురించి ఈ తరానికి తెలిసింది తక్కువే. ఆయన స్త్రీ విద్య కోసం ఉద్యమించి బాలికల పాఠశాలలను కూడా స్థాపించారు. వితంతు పునర్వివాహాల ద్వారా ఆయన గొప్ప ఆదర్శవాదిగా పేరుగాంచారు. 1983లో వచ్చిన ఆంధ్రకేసరి చిత్రంలో రాజమహేంద్రవరం నగర గొప్పతనాన్ని వర్ణిస్తూ 'వేదంలా ఘోషించే గోదావరి' అంటూ ఓ పాట రాశారు.. ఇందులో 'కొట్టుకొని పోయె కొన్ని కోటి లింగాలు... వీరేశలింగమొకడు మిగిలెను చాలు' అని రాశారు గేయరచయిత. అంటే రాజమహేంద్రవరం చరిత్రలో వీరేశలింగం ఎంత ప్రాధాన్యం కలిగిన వ్యక్తి అనేది.. ఒక్క వాక్యంలో చెప్పారు. నేడు ఆయన కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..

- రాజమహేంద్రిలోనే మొదటి వితంతు వివాహం
- ఆయన అడుగుజాడల్లో నడిచిన భార్య రాజ్యలక్ష్మి
- నేడు కందుకూరి వీరేశలింగం జయంతి

1848లో జననం

రాజమహేంద్రవరంలోని సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతులకు 1848, ఏప్రిల్ 16న వీరేశలింగంపంతులు జన్మించారు. సుబ్బారాయుడు తన తండ్రి పేరును కుమారుడికి పెట్టుకున్నారు. వీరేశలింగం పూర్వీకులు దివానులు, రెవెన్యూ ఉద్యోగులుగా పనిచేశారు. వారి స్వస్థలం ప్రకాశం జిల్లా కందుకూరు కాగా వీరు రాజమహేంద్రవరం వలస వచ్చి స్థిరపడ్డారు. క్రమేణా ఊరిపేరే ఇంటి పేరుగా మారింది. వీరేశలింగం పంతులుకు 12ఏళ్ల వయసులో కాతేరుకు చెందిన బాపమ్మ(రాజ్యలక్ష్మి)తో 1861లో వివాహం జరిగింది. 1870లో మెట్రిక్యులేషన్, 1872లో ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత పరీక్ష పాసయ్యారు.

సతీమణి సహకారం

వీరేశలింగం సాంఘిక సంస్కరణోద్యమాల్లో ఆయన సతీమణి రాజ్యలక్ష్మి సహకారం ఎంతో ఉంది. వితంతు వివాహాలపై అప్పటి సమాజంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సహాయ నిరాకరణ చేసేవారు. దీంతో రాజ్యలక్ష్మి స్వయంగా గోదావరి నదికి వెళ్లి నీళ్లు తెచ్చేవారు. తర్వాత నుయ్యి తవ్వించారు.

హితకారిణి సమాజానికి ఆస్తులు

వీరేశలింగం తన ఆస్తులను పాఠశాలల స్థాపనకు, హితకారిణి సమాజానికి, సంఘ సంస్కరణకు వినియోగించారు. తన యావదాస్తిని సమాజానికే వెచ్చించారు. చివరికి తన రచనల ద్వారా వచ్చిన ఆదాయంతో జీవించారు. ఆయన రచనల్లో వెనీస్ వర్తక చరితము, రాజశేఖర చరిత్ర, మార్కండేయ శతకం, సంగ్రహ వ్యాకరణం, రత్నావళీ, సత్యవతీ చరిత్ర, శాకుంతలము, శరీర శాస్త్రము, జంతు స్వభావ చరిత్ర వంటి 50 రచనలను ప్రధాన మైనవి. వివేకవర్ధని, హాస్య సంజీవని, సతీహిత బోధిని, సత్య సంవర్ధని, చింతామణి, సత్యవాదిన, తెలుగు జననం,విద్వన్మనోహారిణి పత్రికల్లో కొన్నింటిని ఆయన స్థాపించి నడపగా.. మరికొన్నింట్లో సంపాదకులు, సహాయ సంపాదకులు బాధ్యతలు నిర్వహించారు.



సంస్కరణలే లక్ష్యంగా..

వీరేశలింగం ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. సమాజంలో ఉన్న దురాచారాలను వ్యతిరేకిస్తూ ఉండేవారు. మతపరమైన, విద్యాపరమైన సంస్కరణలే లక్ష్యంగా బ్రహ్మసమాజాన్ని నెలకొల్పారు. యువజన సంఘాల స్థాపనకు కూడా ఆయనే ఆద్యుడు. తన 33వఏట 1881, డిసెంబరు 11న మొట్టమొదటి వితంతు వివాహాన్ని జరిపించారు. 22ఏళ్ల గోగులపాటి శ్రీరాములు, 12ఏళ్ల గవరమ్మలకు రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో ఈ వివాహం చేయించారు. వితంతు వివాహాల నిర్వహణకు ఆయన 33మంది సభ్యులతో హితకారిణీ సమాజం ప్రారంభించారు. ఆ రోజు నుంచి ఈ సమాజం తరఫున 63వివాహాలు జరిగాయి.



కందుకూరి వీరేశలింగం పంతులు పరిశోధనా కేంద్రంలో వితంతు వివాహ వేడుకల బొమ్మల ప్రదర్శన

1919లో అస్తమయం

చెన్నైలోని ఎగ్మూరులో ఉన్న వేద విలాస్‌లో 1919, మే 27న వీరేశలింగం అస్తమించారు. ప్రస్తుతం వీరేశలింగం దంపతుల సమాధులు ఉన్న ప్రదేశం ఒకప్పుడు ఆనంద ఉద్యానవనం అనేవాళ్లు. తన స్నేహితుడైన చల్లపల్లి రంగయ్య పంతులు నుంచి వితంతు శరణాలయం నిర్వహణ నిమిత్తం 1905లో రూ.2వేలకు వీరేశలింగం కొన్నారు.ఈ తోటకు చేర్చి ఉన్న చల్లపల్లి రామయ్య తోటను 1906లో రూ.600కు కొన్నారు.



వీటీ కళాశాల వద్ద కందుకూరి దంపతుల సమాధులు

పరిశోధనా కేంద్రంలో కందుకూరి పుస్తక లైబ్రరీ

వివేకవర్ధనితో చైతన్యం

1874, అక్టోబరు నెలలో వివేకవర్ధని అనే నాలుగు పేజీల మాస పత్రికలను ప్రారంభించారు. దీనిద్వారా అవినీతిపరులపై యుద్ధం చేసేవారు. సాంఘిక దురాచాల నిర్మూలనకు ప్రజలను చైతన్యం చేయడానికి ఈ పత్రికను ఆయుధంగా చేసుకున్నారు. ఈ పత్రిక ప్రచురణకు కింద కంపోజింగ్ ఉంటే పైన గదిలో ఆయన కూర్చుండేవారు. ప్రతులను ఒక తాడుకు బుట్టకట్టి పైకి లాక్కుని సరిచేసి కిందకు పంపించేవా రు. 1885లో ఆయనకు రాజమహేంద్రవరం పురపాలక సంఘ సభ్యుడిగా అవకాశం లభించింది.



అలనాటి అచ్చుయంత్రం



వీరేశలింగం కుర్చీ



పరిశోధనా కేంద్రంలో పెచ్చులూడిన భవనంపైకప్పు

ఆరుగురికి కందుకూరి పురస్కారాలు

- నేడు విజయవాడలో ప్రదానం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ముగ్గురికి, జిల్లాస్థాయిలో 107మంది ప్రతిభ కలిగిన నాటకరంగ కళాకారులు, సాంకేతిక నిపుణులకు ప్రభుత్వం కందుకూరి పురస్కారాలను ప్రకటించింది. వీరిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆరుగురికి జిల్లాస్థాయి పురస్కారాలు దక్కాయి. వీటిని విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం ప్రదానం చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నాటక, సినీ రచయిత డాక్టర్ బుర్రాసాయిమాధవ్ చైర్మన్‌గా 11మంది నాటకరంగ ప్రముఖులతో ప్రభుత్వం నియమించిన ఎంపిక కమిటీ పారదర్శకంగా పురస్కార గ్రహీతలను ఎంపిక చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో రంగస్థల పురస్కారంతోపాటు రూ.1లక్ష నగదు, జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి రూ.10వేల నగదు అందజేసి సత్కరిస్తామన్నారు. కళా, నాటక రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. విజయవాడలో జరిగే ఈ కార్యక్రమానికి కళాకారులు, సాంకేతిక నిపుణులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

● పురస్కార గ్రహీతలు వీరే..

ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన కె.సత్తిబాబు, శ్రీలేఖ, కాకినాడ జిల్లాకు చెందిన కాలపురెడ్డి వెంకటరమణ, నటకుమారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ద్రాక్షారామ సరోజలకు జిల్లా స్థాయి పురస్కారాలు దక్కాయి.



గోకార్ట్ రేసింగ్ ట్రాక్‌లో కార్లు

రేస్‌కు రెడీ

కాకినాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో గోకార్ట్ రేసింగ్ ట్రాక్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. మరో రెండు రోజుల్లో యాక్టివిటీస్ ప్రారంభం కానున్నాయి. ఈ రేసింగ్‌కు సంబంధించి సుమారు 11 కార్లు చేరుకున్నాయి. సుమారు ఐదున్నర ఎకరాల్లో ట్రాక్ సిద్ధం చేశారు. పర్యాటకులకు ప్రవేశం ఉచితమని నిర్వాహకులు చెప్పారు.

రేపు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని ప్రజల గోడు వినేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం రాజమహేంద్రవరం రానున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని అల్యూమినియం కాలనీ, తాడితోట, వీరభద్ర నగర్, రైతునగర్, ఆదెమ్మదిబ్బ, శేషయ్యమెట్ట ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించి ఇళ్లులేని పేదలను కలుసుకుంది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను కలిసి పేదలకు ఇళ్ల స్థలాల సమస్యలపై మాట్లాడతారన్నారు. అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదల సమస్యలు,వారి బాధలను ఇప్పటికే తాము తెలుసుకున్నామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, నగర కార్యవర్గ సభ్యులుపి.లావణ్య, త్రిమూర్తులు, నగర సమితి నాయకుడు రామరాజు పాల్గొన్నారు.





బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు, ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐదు బెటాలియన్ల క్రీడాకారులు

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

- ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు
- కాకినాడలో ప్రారంభమైన ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు
- పాల్గొన్న నాలుగు బెటాలియన్ల క్రీడాకారులు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆరోగ్యంగా ఉండవచ్చని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండెంట్ నాగేంద్రరావు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి వారితో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బెటాలియన్ నుంచి ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పలు క్రీడా పోటీల్లో రాణించారన్నారు. అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. అతిథులు శాంతి కపోతాలు, రంగుల బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. కాకినాడ 3వ బెటాలియన్‌తో పాటు విజయనగరం 5వ బెటాలియన్, మంగళగిరి 6వ బెటాలియన్, విశాఖపట్నం 16వ బెటాలియన్ పోలీస్ క్రీడాకారులు రన్నింగ్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, వాకింగ్, డిస్కస్‌త్రో, చెస్, క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు బి.చంద్రశేఖర్, ఎస్.మన్మథరావు, ఆర్ఐలు అజయ్‌కుమార్, రవిశంకర్‌రా వు, విఠలేశ్వరరావు, ప్రసాద్, బెటాలియన్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు

20 కిలోమీటర్ల వాకింగ్‌లో ఎం.లక్ష్మణ్, బి.చక్రధర్, టి.శ్రీనివాసరావు. 800 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, వి.సూర్యారావు, బి.రవితేజ, 400 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, జి.మురళి, బి.రవితేజ, డిస్కస్‌త్రోలో టి.ధర్మారావు, ఎన్.కృష్ణారెడ్డి, ఎస్.అబ్రహం, జావెలిన్‌త్రోలో వి.శుభకర్, ఎన్.కృష్ణమూర్తి, ఎస్.అబ్రహం, లాంగ్ జంప్‌లో జి.శ్రీనివాసరావు, వి.సీతారాం, జి.మురళి, షాట్‌పుట్‌లో ఎం.రాంబాబు, ఎం.చంద్రశేఖర్, ఎస్.మోహన్‌రావు... ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. చదరంగం, క్రికెట్ సెమీ ఫైనల్స్ బుధవారం జరుగుతాయి.



పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు



షాట్‌పుట్‌లో సత్తా చాటుతున్న క్రీడాకారుడు



పరుగు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



జడ్జి మల్లికార్జునరావుకు వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకులు

శనేశ్వర ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు

కొత్తపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి మంగళవారం హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు కుటుంబ సభ్యులతో విచ్చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామమూర్తి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం జడ్జి కుటుంబీకులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించారు.



కూపర్ భాను అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కూపర్ భాను సేవలు ఆదర్శనీయం

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహాలకు ఉచితంగా స్వయంగా అంత్యక్రియలు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన కూపర్ భాను అంబేడ్కర్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేయడం చాలా సహనంతో కూడిన పని అన్నారు. ఎంతో పెద్ద మనసు ఉంటేనే తప్ప ఇలాంటి కార్యక్రమాలు చేయలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు అవమానం

● శంఖవరంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులు

● భగ్గుమన్న దళిత సంఘాలు ● రోడ్డుపై బైఠాయింపు

శంఖవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘోర అవమానం జరిగింది. ఆగంతకులు మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారు. ఉదయం 6గంటలకు ఈ సంఘటన వెలుగులోకి రావడంతో స్థానిక కాలనీవాసులు, దళిత సంఘాలు భగ్గుమన్నాయి. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఉదయం నుంచి రోడ్డుపై బైఠాయించారు. దోషులను శిక్షించేవరకూ ఆందోళన విరమించేదిలేదంటూ భీష్మించారు. అడిషనల్ ఎస్పీ ఎమ్‌జేవీ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్, డాగ్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. సీసీటీవీని ఫుటేజ్‌ని పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు.


శంఖవరంలో రోడ్డుపై బైఠాయించిన దళితులు


అంబేడ్కర్ విగ్రహానికి వేసిన చెప్పుల దండ

24 గంటల్లో పట్టుకుంటాం : ఎస్పీ

ఆందోళనాకారులతో చర్చించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్ నిందితులను పట్టుకునేందుకు 24 గంటల సమయం కోరారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీసీఫుటేజ్, ఇతర సీసీ కెమెరాలను పరిశీలించామని, సెల్ టవర్ ఆధారంగా కూడా వారి ఫోన్లను ట్రేస్ చేస్తున్నామని, నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే దళిత సంఘాల నేతలు, పోలీసులతో కమిటీ వేశామన్నారు. విచారణ వేగవంతం చేస్తామని, నిందితులను పట్టుకునేందుకు సహకరించాలని కోరారు. నిందితులను పట్టుకునేవరకూ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శంఖవరంలోనే ఉంటారని ఆయన తెలిపారు.

నిందితులను గుర్తిస్తే బహుమతి



అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన నిందితులను గుర్తించినవారికి బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్‌ను పోలీసులు విడుదల చేశారు. తెల్లవారుజాము న 3:30 గంటల సమయంలో బైక్‌పై వెళ్తున్న నిందితుల వీడియో సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేసామని పోలీసులు తెలిపారు.


నిరసనకారులతో మాట్లాడుతున్న కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లాం : ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు/శంఖవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన ఘటనను హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని, దీనిపై హోం మంత్రి, జిల్లా ఎస్పీలతో మాట్లాడామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనపై ప్రజలు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు.

ఉమ్మడి జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల్లో

విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన

▸▸ అమరావతి ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతిరావు ▸▸ కాకినాడలో ప్రత్యేక అధికారులకు వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సీతాపతిరావు

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని అమరావతి ప్రణాళిక విభాగం సీనియర్ సలహాదారు డీవీవీ సీతాపతిరావు సూచించారు. కాకినాడ కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అసెంబ్లీ నియోజవర్గాల ప్రత్యేక అధికారులు, ప్రణాళిక యూనిట్ సభ్యులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సేవారంగాలు ఎలా అభివృద్ధి చేయవచ్చో తెలిపే విధంగా యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కొక్క ప్రత్యేక అధికారులకు అనుబంధంగా ఐదుగురు సచివాలయంసిబ్బంది పనిచేస్తారన్నారు. నియోజకవర్గాల్లో ఉన్న అవకాశాలను అనుసరించి వ్యవసాయం, పారిశ్రామికరంగం, సేవా రంగాల అభివృద్ధి చెందే విధంగా ప్లాన్ రూపకల్పన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకున్న ఈ నిర్ణయంతో నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 3జిల్లాల అర్థగణాంక అధికారులు త్రినాద్, అప్పల కొండ, వెంకటేశ్వర్లు, జడ్పీసీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్‌లో పవర్ సెంటర్ స్పెషల్ ఆఫీసర్...

సుడిగాలి పర్యటన

మోతుగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ పవర్ సెంటర్ స్పెషల్ ఆఫీసర్ ఏపీ సాంబశివరావు సుడిగాలి పర్యటన చేశారు. సీలేరు కాంప్లెక్స్‌లో పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాలను సోమ,మంగళవారాలు స్థానిక జెన్‌కో అధికారులు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పనితీరుపై ఆరా తీశా

విద్యుత్ ఉత్పత్తిపై ఆరా

రు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో కొత్తగా కడుతున్న రెండు యూనిట్ల పనులను కూడా పరిశీలించి ఐదు,ఆరు యూనిట్లు ఎప్పటికీ వినియోగంలోకి వస్తాయని అడిగి తెలుసుకున్నారు. సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై జెన్‌కో అధికారులతో చర్చించారు. ఎగువ సీలేరులోని పార్వతినగర్‌లో నూతనంగా నిర్మించే పంప్ స్టోర్ ప్రాజెక్టు ప్రదేశం, డబ్బింగ్‌యార్లు, ఇంటెక్ డ్యాము, రెగ్యులేటర్ డ్యాములను పరిశీలించారు. ఆయన వెంట సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, డీఈటీ వరప్రసాద్, లోయర్ సీలేరు అధికారులున్నారు.


పొల్లూరు వాల్‌హౌస్ పెన్‌స్టాక్ పనులను పరిశీలిస్తున్న ఏపీ సాంబశివరావు

పాస్టర్ ప్రవీణ్‌ది ప్రమాదం కాదు.. హత్యే

ఫేక్ వీడియోలు సృష్టించిన పోలీసులు : మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని.. హత్యేనని.. పోలీసులు ఫేక్ వీడియోస్ లీక్ చేసి వాటినే ఆధారాలుగా చూపించి రోడ్డు ప్రమాదంగా మలిచారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మత మార్పిడి చట్టాన్ని వ్యతిరేకిస్తూ 2022 డిసెంబర్ 15న సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని, ఈ నెల 16న సుప్రీంకోర్టు బెంచ్ వద్ద ప్రవీణ్ పగడాల తన వాదన వినిపించి ఆధారాలు సమర్పించాల్సిఉందన్నారు. బీజేపీ స్పోక్స్ పర్సన్ అశ్విన్‌కుమార్ ఉపాధ్యాయ, అతని అడ్వకేట్ అశ్విని దుబేలు ప్రవీణ్ పగడాల విషయంలో ప్లాన్ చేసి ఉంటారని ఆరోపించారు. ఈ నెల 19న సాయంత్రం కొంతమూరులో ప్రవీణ్‌కు ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఫ్లెక్సీ పెట్టి కొవ్వొత్తులు వెలిగిస్తామన్నారు. ప్రవీణ్ పగడాలది హత్య అని నమ్మేవాళ్లంతా అక్కడకు రావాలని సూచించారు. ఈస్టర్ పండుగ రోజు క్రైస్తవ బరియల్ గ్రౌండ్‌లో ప్రవీణ్ పగడాల ఫ్లెక్సీ పెట్టి కొవ్వొత్తులు వెలిగించాలని ఆయన కోరారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరమైన ఫొటోలు... డబ్బులివ్వాలని యువతికి వేధింపులు...

ఆలమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో అసభ్యకరమైన ఫొటోలను పోస్టు చేసి వేధిస్తున్న యువకుడిని ఆలమూరు పోలీసులు అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన అమ్మాయితో స్నాప్‌చాట్ ద్వారా కర్నూలుకు చెందిన పడిపోవు హరీష్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో ఆమెతో తరచు ఫోన్ మాట్లాడేవాడు. అప్పుడప్పుడు న్యూడ్ వీడియో కాల్స్ కూడా మాట్లాడుకునేవారు. అయితే ఆ సమయంలో ఆమెకు తెలియకుండా స్క్రీన్‌షాట్‌తో ఫొటోలు తీసేవాడు. ఈ నేపథ్యంలో ఆమెను డబ్బులు కావాలని డిమాండ్ చేయడం ప్రారంభించాడు. ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో ఇన్‌స్టా

బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుడి అరెస్టు

14 రోజుల రిమాండ్

గ్రామ్‌లో మూడు అకౌంట్లు ఓపెన్ చేసి ఈ ఫొటోలను పోస్టు చేయడంతో ఆ యువతి ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ దర్యాప్తు చేసి కర్నూలుకు చెందిన పడిపోవు హరీష్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు ఆలమూరు కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి హరీష్‌కు 14రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు జైలుకు తరలించారు. సోషల్ మీడియా యాప్‌ల పరిచయం ఏర్పడిన వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ అశోక్‌లు సూచించారు.

గోదావరి పుష్కర పనుల్లో నిధుల దుర్వినియోగం

మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కర పనుల్లో నిధులు దుర్వినియోగం ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంటు అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా కొవ్వూరు మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. కొవ్వూరు మున్సిపాల్టీలో పుష్కర నిధులతో చేపట్టిన గోదావరి బండ్ సుందరీకరణ పనుల్లో నిధులు దుర్వినియోగంపై విచారణ అనంతరం జరిమానా కింద అప్పటి మున్సిపల్ ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన పీవీ ప్రభాకరరావు, రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వైవీ నరసింహరావు పింఛను నుంచి 3 శాతం ఒక సంవత్సరం పాటు నిలుపుదల చేయాలని, అలాగే రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ బి.శ్రీధర్ పింఛను నుంచి 3శాతం రెండేళ్లపాటు నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

లారీని ఢీకొన్న అంబులెన్స్

ముగ్గురికి స్వల్ప గాయాలు

దేవరపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నుంచి అంబులెన్స్‌లో పేషెంట్‌ను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు హైవే వద్ద ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం 6గంటలకు ముందుగా వెళ్తున్న లారీని అంబులెన్స్ ఢీకొనడంతో అంబులెన్స్ డ్రైవర్, పేషెంట్, పేషెంట్ బంధువుకు స్వల్పగాయాలయ్యాయి. వారిని మరో అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ఘటనా స్థలంలో అంబులెన్స్


మబ్బులే... మదిదోచేనే..

కాకినాడలో ఓ చోట ఆకాశంలో మబ్బులు అలుముకున్నాయి మనసును దోచే ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా

ఫొటోగ్రాఫర్ -కాకినాడ

పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ...

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

⏮ మరో ముగ్గురి పరిస్థితి విషమం

⏮ లారీని కారు వేగంగా ఢీకొనడంతో ప్రమాదం

⏮ నేడు స్వగ్రామానికి మృతదేహాలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీను కుటుంబ సభ్యులు ఈ నెల 14వ తేదీన తెలంగాణలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వెళ్లి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి పయమమయ్యారు. జనగామ జిల్లా స్టేషన్ గణాపూర్ మండలంలోని రాఘవపూర్ గ్రామ పరిధిలో జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీని వారి కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సత్తి కుటుంబీకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు తీవ్ర గాయల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీను (50), సత్తి రమణకుమారి (45), సత్తి అనూష(22) అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలను జనగామ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదంలో తీవ్రగా గాయపడిన సత్తి రాజేశ్వరరావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీను, రమణకుమారి, అనూష మృతదేహాలను బుధవారం స్వగ్రామమైన సవరప్పాలెం తీసుకురానున్నట్టు బంధువులు తెలిపారు. సత్తి కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాజుల రామారం ప్రాంతానికి వెళ్లి గత కొన్నేళ్ల క్రితమే స్థిరపడ్డారు.


కారులో ఇరుక్కున్న శ్రీను మృతదేహం


రమణకుమారి, అనూష మృతదేహాలు

చనిపోయిందా? చంపేశారా?



రోడ్డుపక్కన కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం

కాళ్లకు పట్టీలు, మెట్టెలు..

తల వద్ద ఖాళీ గాజు సీసా

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన తుప్పల్లో కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యంకావడం కలకలం రేపింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు పంచాయతీ పరిధిలో శ్రీరాంపురం రిజర్వు ఫారెస్టు ప్రాంతం కవలగొయ్యికి వెళ్లే దారిలో తుప్పల్లో మృతదేహం ఉన్నట్టు అదే గ్రామానికి చెందిన కొవులూరి తాతారావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ పి.కాశీ విశ్వనాథం తన సిబ్బందితో ఘటనా ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఒంటిపై లేత గోధుమ రంగు చున్నీ పీలికలు ఉన్నాయి. కాళ్లకు పట్టీలు, మెట్టెలు ఉండడంతో వివాహిత అని గుర్తించారు. ఆమెకు సుమారు 30-35 ఏళ్లు ఉంటాయని, మరణించి 20 రోజులపైనే గడిచి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహం లభ్యమైన చోట ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని పోలీస్ స్టేషన్లకూ సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, వివరాలు తెలిసినవారు దగ్గరలోని పోలీస్‌స్టేషను, 112కి లేదా 9440796533లో తెలియజేయాలని సీఐ కోరారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో అన్నికోణాల్లో దర్యాప్తు ప్రారంభించామని ఆయన చెప్పారు.

సామూహిక అత్యాచారం జరిగిందా?

మహిళ మృతదేహం పడి ఉన్న స్థితిని గమనిస్తే సామూహిక అత్యాచారం జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల వద్ద మద్యం ఫుల్ బాటిల్ వంటి సీసా, కాళ్లకు సమీపంలో టిన్ బీర్ ఖాళీ డబ్బా ఉండగా శరీరం 80శాతానికి పైగా కుళ్లిపోయి ఎముకలు కనబడుతున్న స్థితిలో ఉంది. పంజాబీ డ్రెస్ ధరించినట్టు తెలుస్తున్నా.. దుస్తులు దాదాపుగా ధ్వంసమైపోయాయి. చున్నీ ఆమె శరీరంపై లేకుండా పక్కన ఉండడం వల్ల ఇంకా కొద్దిగా గుర్తు పట్టే స్థితిలో ఉండి లేత గోధుమ రంగులో కనబడుతోంది. నోరు పూర్తిగా తెరిచి ఉంది. దీంతో సామూహిక అత్యాచారం చేసి చంపేశారనే అనుమానాలు బలపడుతున్నాయి. చున్నీ మెడకు బిగించి చంపేసినట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు వేరే చోట సామూహిక అత్యాచారం చేసి తీసుకొచ్చి ఇక్కడ పడేశారనే చర్చ కూడా నడుస్తోంది. మృతదేహం ఉన్న చోటు రాజానగరం, బొమ్మూరులో ఏ పోలీస్ స్టేషను పరిధిలోకి వస్తుందనే సందేహంపై చాలాసేపు తర్జనభర్జన జరిగింది. చివరికి బొమ్మూరు పోలీసులు కేసు కట్టి దర్యాప్తు ప్రారంభించారు. మిస్సింగ్ కేసులను పరిశీలిస్తున్నారు.

గోదావరిలో గల్లంతయిన

యువకుల మృతదేహాలు లభ్యం

పోస్టుమార్టం అనంతరం

కుటుంబ సభ్యులకు అప్పగింత

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో గల్లంతయిన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన మట్టి ప్రకాష్(14), ఉసురుమత్తి రత్నదీప్ అలియాస్ వెస్లీ, రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష(17) ఈనెల 14న సోమవారం గోదావరిలో స్నానానికి కొవ్వూరు మండలం సీతంపేట పంచాయతీ పరిధిలోని చిగురులంక వెళ్లారు. నదిలోతు తెలియక మునిగిపోతుండగా అక్కడే ఉన్న పిల్లి దివాకర్ చూసి రత్నదీప్‌ను రక్షించాడు. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో గాలింపు చర్యలను పర్యవేక్షించారు. నదిలోతు ఎక్కువగా ఉండడంతో మంత్రి ఆదేశాల మేరకు కాకినాడ నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రప్పించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో రెండు మృతదేహాలను వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మట్టి ప్రకాష్ తండ్రి కిషోర్‌బాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.


గంధం హర్ష, మట్టి ప్రకాష్ మృతదేహాలు

వివాహిత అనుమానాస్పద మృతి

భర్తే హతమార్చాడంటూ ఆసుపత్రి ముందు మృతురాలి బంధువులు ఆందోళన


మరణించిన నూకరత్నం(ఫైల్)

తుని రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం సీతయ్యపేట గ్రామంలో వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాల ప్రకారం.. సీతయ్యపేట గ్రామంలో గ్రామానికి చెందిన సూరడ నూకరత్నం (26)కు దగ్గర బంధువైన శివతో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత కొద్దిరోజులుగా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్టు మృతురాలు కుటుంబసభ్యులు ఆరోపించారు. మంగళవారం నూకరత్నం భోజనం అనంతరం విపరీతమైన వాంతులకు గురికావడంతో స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మహిళ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కట్టుకున్న వాడే కూరలో విషం కలిపి భార్యను హతమార్చాడంటూ ఆరోపించారు. దీంతో పోలీసులు వచ్చి శవ పంచనామ రిపోర్టు ఆధారంగా మహిళ మరణానికి భర్తే కారణమైతే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన ఆపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

వ్యక్తి మరణం వ్యవహారంలో కేస్ షీట్ వివాదం

కాకినాడ జీజీహెచ్‌లో ఉద్రిక్తత

విచారణ జరుపుతాం: సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి


వీరాంజనేయులు మృతదేహం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మరణం వ్యవహారంలో కేస్ షీట్ వివాదం జరిగి కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన జానా వీరాంజనేయులు (60)కు గతంలో కాలికి దెబ్బ తగిలింది. అతడికి మధుమేహ వ్యాధి ఉండడంతో ఎంతకీ దెబ్బ తగ్గకపోవడంతో గత నెల 27వ తేదీన కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. 30న వైద్యులు కాలి పాదానికి శస్త్రచికిత్స చేశారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు బాగానే ఉన్నాడు. ఆ మర్నాడు అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న అతడికి ఎగ ఊపిరి రావడంతో పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టినట్లు నిర్ధారించి బాధితుడిని మెడికల్ వార్డుకు షిఫ్ట్ చేశారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న వీరాంజనేయులును మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. అక్కడి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వైద్యురాలు డాక్టర్ తన్మయి నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే వీరాంజనేయులు మృతి చెందినట్టు కుటుంబీకులు ఆరోపించి ఆందోళనకు దిగుతున్న సమయంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి వార్డుకు చేరుకుని వీరాంజనేయులు మృతికి కారణమైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని భరోసా ఇవ్వడంతో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు. దీంతో ఆందోళన సద్దు మణిగింది.

అవంతి ఫ్యాక్టరీలో డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న సరిత

ఏలేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో అవంతి అగ్రోజెన్ ఫుడ్స్ ఫ్యాక్టరీలో క్యాంటీన్‌ను జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి సరిత మంగళవారం పరిశీలించారు. ఇక్కడ కలుషిత ఆహారం తిని సిబ్బంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. పరిశ్రమలో తాగునీరు, క్యాంటీన్‌ను సరిత పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం పాలైనవారిలో కొందరు ఫ్యాక్టరీ బయట ఆహారం తీసుకున్నారని, అందుకే ఇలా జరిగి ఉంటుందని పరిశ్రమ సిబ్బంది తెలిపారు. జగ్గంపేటలో ప్రైవేట్ ఆసుపత్రిలో 6మందికి ఇద్దరు మాత్రమే చికిత్స పొందుతున్నారని, 4 మంది డిశ్చార్జి అయినట్టు తెలిపారు. వైద్యులు శ్రీలక్ష్మీ తదితరులున్నారు.

మెట్లపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మెట్లపై నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన కోట లక్ష్మణరావు (30) సోమవారం ఇంటి వద్ద మేడ మెట్లు దిగుతుండగా జారిపడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రత్తిపాడులో పెంకుటిల్లు దగ్ధం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా మంగళవారం ఉదయం పెంకుటిల్లు దగ్ధమై రూ.4లక్షల ఆస్తినష్టం జరిగింది. ఫైర్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు స్థానిక రాజుగారు వీధిలోని రెడ్నం కోటేశ్వరావు, తోట సురేష్‌కు చెందిన పెంకుటిల్లు విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. బీరువాలు, విలువైన సామాగ్రి దగ్ధమయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్థానిక ఫైర్ అధికారి ఎంజీ రత్నరాజు, బి.సూర్యనారాయణ, దుర్గాప్రసాద్‌ల బృందం సంఘటనా స్థలానికి తరలివెళ్లి మంటలు అదుపుచేశారు.

వరుసకు కూతురైన బాలికపై...

మారు తండ్రి లైంగిక దాడికి యత్నం

తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి యత్నించిన మారు తండ్రిపై కేసు నమోదైంది. హైదరాబాద్ కమలాపురి కాలనీలో నివాసముండే ఓ మహిళ భర్తతో విడిగా కుమార్తె(10)తో కలిసి ఉంటుంది. కొన్నేళ్లక్రితం కాకినాడకు చెందిన వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరు సహజీవనం చేయడం ప్రారంభించారు. మహిళ గర్భవతి అయింది. ప్రసవానికి ఆస్పత్రికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె కుమార్తెపై మారు తండ్రి కన్నేశాడు. అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి యత్నించాడు. తప్పించుకున్న బాలిక స్థానికులసాయంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

రాజానగరంకు మరో రెండు పీహెచ్‌సీలు

» త్వరలో గాదరాడలో ఒకటి, శ్రీకృష్ణపట్నంలో మరొకటి ఏర్పాటు

» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



ఆరోగ్యశాఖ మంత్రికి సత్యకుమార్ యాదవ్‌కు నివేదికలు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల(ఫైల్)

రాజానగరం/కోరుకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో మరో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మంగళవారం వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో జనాభాను దృష్టిలో ఉంచుకుని గతంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తిచేసిన నేపథ్యంలో కొత్తగా రెండు పీహెచ్‌సీలు ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజానగరం, పాలచర్ల, కోరుకొండ, కోటికేశవరం, దోస కాయలపల్లి, సీతానగరం, బొబ్బిల్లంకలో పీహెచ్‌సీలున్నాయి. ప్రస్తుతం ఉన్న జనాభా దృష్ట్యా కొత్తగా మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు విన్నవించామన్నారు. దీంతో కోరుకొండ మండలం గాదరాడ, రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం గ్రామాల్లో పీహెచ్‌సీలను నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని, ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆదేశించగా, సదరు నివేదికలను ప్రభుత్వానికి పంపినట్టు ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు. త్వరలోనే పీహెచ్‌సీల ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు.

సంతాన సాఫల్యానికి అత్యాధునిక వైద్యసేవలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : పిల్లలు లేని దంపతులకు అత్యాధునిక వైద్య పద్ధతుల్లో సంతానోత్పత్తికి అవకాశాలు కల్గిస్తున్నామని, ప్రపంచస్థాయి సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చామని రాజమహేంద్రవరంలోని ఫెర్టి9 ఫెర్టిలిటీ సెంటర్ స్పెషలిస్టు వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని ఉయ్యూరి, డాక్టర్ సౌమ్య వరుడు వెల్లడించారు. మంగళవారం ఫెర్టి9 ఫెర్టిలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దంపతుల్లో పిల్లలు పుట్టకపోవడానికి అనేక కారణాలు ఉంటాయని, వాటన్నింటినీ ముందుగా స్టడీ చేయాలని, దీని కోసం తమ సెంటర్‌లో యూరోపియన్ స్టాండర్డ్స్ ఐఎస్‌ఓ6తో కూడిన అత్యాధునిక సాంకేతికత కల్గిన లేబరేటరీ ఏర్పాటు చేశామన్నారు. సంతానం కోసం గ్రామీణ, పట్టణ ప్రాంత దంపతులు దూరప్రాంతాలకు వెళ్లనవసరంలేదని అన్నారు. తమ సెంటర్‌లో 60శాతం ఐవీఎఫ్ సక్సెస్ రేటు సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రస్తుత ఆధునికయుగంలో సంతానలేమి సమాజంలో పెద్ద సమస్యగా మారుతోందని, ఈ నేపథ్యంలో తమ సెంటర్ ద్వారా గ్రామాల్లో నెలలో రెండుసార్లు సామాజిక విద్య, అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని వారు వెల్లడించారు.

కార్మికుల జీతభత్యాలపై సీఎం అడిషనల్ సెక్రటరీకి ఓపీడీఆర్ కమిటీ వినతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరు లిమిటెడ్ పరిశ్రమ ఉద్యోగుల, కార్మికుల జీతభత్యాల పెంపుదల సమస్యను ప్రభుత్వం వెంటనే న్యాయబద్ధంగా పరిష్కరించాలని ఓపీడీఆర్ సంఘీభావ కమిటీ ముఖ్యమంత్రి అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రాకు విన్నవించారు. ఈ మేరకు కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. మిల్లు కార్మికులకు, ఉద్యోగులకు 2020 జూలై 1 నుంచి జీతభత్యాలు పెంచాల్సి ఉందని, కాని యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, నిరంకుశ విధానాల వల్ల నాలుగేళ్లకు పైగా కాలం గడిచినా తమ సమస్య అపరిష్కృతంగానే ఉందన్నారు. సమస్య పరిష్కార బాధ్యతను అడిషనల్ సెక్రటరీకి సీఎం అప్పగించారని ఈ సందర్భంగా ఓపీఆర్‌డీ ఆధ్వర్యంలో వివిధ కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు రాజమండ్రి పేపరుమిల్లు కార్మికుల హక్కుల సంఘీభావ కమిటీగా ఏర్పడి సమస్యకు సంబంధించిన వివరాలను, వాస్తవాలను కార్మికులు, ఉద్యోగులు వారి సంఘాల నుంచి సేకరించి కార్తికేయ మిశ్రాను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఓపీఆర్‌డీ సంఘీభావ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.రవీంద్రప్రసాద్, ఫ్యాప్టో నేత జేవీవీఎస్ఎన్ రాజు, ఆంధ్ర పేపరు మిల్స్ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఏవీవీ శ్రీనివాస్, డీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి కె.రాంబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

● రాజీవ్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక రాజీవ్‌నగర్‌లో రూ.1.08 కోట్లతో నిర్మించిన ప్రధాన రహదారి, డ్రైనేజీలు, మరో 8 సీసీ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో గోరంట్ల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో త్వరలోనే వ్యవసాయ కళాశాల రాబోతుందని, స్థానికుల సౌకర్యం కోసం పాఠశాలలతో పాటు రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయంలో అనర్హులను గుర్తించి అర్హులకు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్లను రాజీవ్‌నగర్ వాసులు ఘనంగా సత్కరించారు. అనంతరం హైవే నుంచి సాయిబాబా గుడి వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎర్ర కొండపై డ్రైన్ల నిర్మాణం కోసం పలువురు వినతిపత్రం అందజేయగా డ్రైన్ల నిర్మాణానికి, వడ్డెర్లకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులుమంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్య దర్శి జి.వెంకట్రావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు పం దూరి అప్పారావు, మండలాధ్యక్షుడు ఎం.శివసత్యప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, మార్ని వాసుదేవరావు, ఆళ్ల ఆనందరావు, పిన్నంటి ఏకబాబు, నీలి కోటేశ్వరరావు, యడ్ల మహేష్, బీరా ప్రకాష్, షేక్ అసీనా, ఒంటెద్దు స్వామి, పన్నాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్ర పరికరాల అందజేత

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవోలు గ్రామంలో సబ్సిడీతో కూడిన పలు వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదని, ధాన్యం కొనుగోళ్ల తరువాత రైతులకు 3నుంచి 4నెలల వరకు సొమ్ము జమ చేసేదికాదని, ప్రస్తుత ప్రభుత్వం ధాన్యం అమ్మిన 24గంటల్లోపే రైతుల ఖాతాకు సొమ్ములు జమ చేస్తోందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ జిల్లాలో రూ.3.92 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేస్తోందన్నారు. రైతులంతా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, మత్యేటి శివసత్యప్రసాద్, గాలి వెంకటేశ్వరరావు, నిమ్మలపూడి రామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో భీమరాజు, ఏఈవోలు పాల్గొన్నారు. అలాగే రాజవోలు జడ్పీ హైస్కూల్లో గోరంట్ల శాంతారాం జ్ఞాపకార్థం జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టును టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్‌తో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో ఎన్నడూ లేని పథకాలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చరిత్రలో ఎన్నడూ లేని సంక్షేమ పథకాలను తమ నాయకుడు, సీఎం చంద్రబాబు ప్రజలకు అందిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమరావతి అభివృద్ధిలో మరో కీలక ఘట్టాన్ని ఆవిష్కరిస్తున్నారని చెప్పారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్లు అందజేత



ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్లు అందిస్తున్న ఏఎస్పీ, అగర్వాల్ ఎండీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ కళ్లజోళ్లను పంపిణీ చేసారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, అర్జున్, చెంచిరెడ్డిలతో కలిసి 300 మందికి కూలింగ్ కళ్లజోళ్లను డాక్టర్ అగర్వాల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సత్తి విజయ్ అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ అగర్వాల్ సంస్థ దేశంలోనే అత్యధిక బ్రాంచ్‌లు ఉండి మంచి పేరున్న ఆసుపత్రి అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, కార్యంశెట్టి జయకుమార్ రెడ్డి, అఖిల్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శివాంజనేయ నర్సరీని సందర్శించిన హైకోర్టు జడ్జి



జడ్జి మల్లికార్జునరావుకు మొక్కను అందిస్తున్న పోలారాజు

కడియం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కడియం మండలం కడియపులంకలో శివాంజనేయ నర్సరీని మంగళవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు సతీసమేతంగా సందర్శించారు. వారికి నర్సరీ అధినేత పోలారాజు మొక్కను అందించి స్వాగతించారు. అనంతరం మొక్కలు అన్నీ చూసిన జడ్జి దేశవిదేశాలకు చెందిన మొక్కలన్నీ కడియంలో ఉన్నాయన్నారు. బోన్సాయ్ మొక్కలు అబ్బుర పరిచేవిధంగా ఉన్నాయని, కడియం నర్సరీను సందర్శించడం ఆనందంగా ఉందని న్యాయమూర్తి అన్నారు. కడియం ఒక ప్లాంట్ ప్యారడైజ్ అని న్యాయమూర్తి కితాబు ఇచ్చారు.

ఏఐఎఫ్‌టీయూలోకి కార్మిక నాయకుడు జోజి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గత 30ఏళ్లగా రాజమహేంద్రవరం కేంద్రంగా క్వారీ కార్మిక, సామిల్లు వర్కర్స్, గ్యాస్ డెలివరీ వర్కర్స్ సంఘాల నాయకుడిగా పని చేసిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కె.జోజి ఆ పార్టీకి రాజీనామా చేసి ఏఐఎఫ్‌టీయూలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక క్వారీ సెంటర్ సమీపంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జోజి ఏఐఎఫ్‌టీయూలో చేరారు. ఈ సందర్భంగా జోజి మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని తీవ్రంగా నష్టపరుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న పోరాటాల్లో కార్మిక వర్గం అంతర్గత సమస్యలు ప్రక్షాళన చేసుకుని పటిష్టమైన ఐక్యతను సాధించాలన్నారు. అనంతరం ఈనెల 22న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే వీఐ లెనిన్ జయంతి కార్యక్రమాలు, సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్, ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకుడు కొండ దుర్గారావు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ



కడియం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఫైలేరియా బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. మంగళవారం గ్రామంలోని పీహెచ్‌సీలో ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ద్వారా అందించే సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురాం, వైద్యాధికారి డాక్టర్ మణిజ్యోత్స్న మాట్లాడారు. ఫైలేరియా నియంత్రణకు జిల్లా మలేరియా కార్యాలయం ద్వారా ఉచితంగా కిట్ల అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి ఎం.రామకృష్ణ, సీహెచ్ విల్సన్ పాల్, మూర్తి, సునీత, శాంతిప్రియ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మహేశ్వరికి బైపీసీలో ప్రథమ స్థానం



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

కడియం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కడియం ఏవీఆర్ జడ్పీ హైస్కూల్ ప్లస్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ బైపీసీలో విద్యార్థి జ్యోతుల మహేశ్వరి 954 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే 934 మార్కులతో సత్యవాడ రూప్సీ ద్వితీయ స్థానంలో నిలిచింది. సీఈసీ చదువుతున్న కె.నాగదేవి 748 మార్కులు, సువర్ణశిరీష 658 మార్కులు సాధించారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ, పీజీటీలు, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ సత్కరించారు.

బెల్ట్‌షాపులపై దాడి.. ఒకరి అరెస్ట్

రంగంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల వెంకటాపురం గ్రామంలో మంగళవారం బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుబ్బల అప్పారావు దగ్గర 8 మద్యం సీసాలు కలిగి ఉండటంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్ఐ వై.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.



శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మంకు జ్ఞాపిక అందజేస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

ఏఐ టెక్నాలజీపై దృష్టిసారించాలి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ అధ్యాపకులు సమాజానికి ప్రయోజనకరమైన ప్రాజెక్టు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోలోని అడ్వాన్స్ సిస్టమ్స్ లేబోరేటరీ శాస్త్రవేత్త-ఎఫ్ డాక్టర్ కె.వీరబ్రహ్మం అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులకు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ సంస్థల నుంచి విశ్వవిద్యాలయానికి సిఎస్ఆర్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధిపర్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధ్యాపకులకు సూచించారు. వివిధ సంస్థలతో అనుసంధానమై ప్రాజెక్టులు నిర్వహించాలని అన్నారు. కృత్రిమ మేధలో వైద్య, పారిశ్రామిక రంగాలకు ఎక్కువ డిమాండ్ ఉండే అవకాశం ఉందని అధ్యాపకులు వాటిపై దృష్టి సారించాలని చెప్పారు. సమావేశానికి హాజరైన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ అన్ని విభాగాలు వినూత్న ఆలోచనలతో విశ్వవిద్యాయాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం శాస్త్రవేత్త వీరబ్రహ్మంను సన్మానించి జ్ఞాపిక అందజేసారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులతో పలు అంశా లపై మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య పి.సురేష్‌వర్మ తదితర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

అనపర్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మంగళవారం అనపర్తి, లక్ష్మీనరసాపురం గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు, భూమిపూజ, ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి నిర్వహించారు. ముందుగా కెనాల్ రోడ్డులో ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం పాతపూరులో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాలు భవన నిర్మాణ పనులకు ఆమె భూమిపూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామంలో నిర్మించిన ఆరు సీసీ రోడ్లను ఎంపీ ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అనేక సీసీ రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం సీసీ రోడ్ల నిర్మాణాలకు విరివిగా నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. అనపర్తి నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నామని అన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఎంపీ సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పక్కి నాగేంద్ర, జనసేన నాయకుడు రావాడ నాగు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివరామకృష్ణంరాజు, నాలుగు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ అధ్యక్షులు, సర్పంచ్‌లు తేతల సుధాకరరెడ్డి, గిరిడా గంగాభవాని, గొల్లు హేమతులసి, మహి ళాశక్తి నాయకులు జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, బిక్కవోలు రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: అనపర్తి, బిక్కవోలు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీ పురందేశ్వరి అధికారులను ఆదేశించారు. మంగళవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డిలతో కలిసి అనపర్తిలో చేపట్టిన రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కోసం పలువురు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని లక్ష్మీనరసాపురం వద్ద నిర్మాణం చేపట్టనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతాన్ని ఆమె సందర్శించి భూసేకణ అంశంపై ఎమ్మెల్యే నల్లమిల్లిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్ఎస్‌పురంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, నియోజకవర్గ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట, (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మంగళవారం అనపర్తి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడానికి కృషి చేసిన కళాశాల అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరామ్, మండవిల్లి గుప్త, వెలమాటి సుధాకర్, కళాశాల అధ్యాపకులు పి.కృష్ణమూర్తి, కేవీ కృష్ణ, ఏవీడీ ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు ఎంపీ ప్రారంభోత్సవం

సీతానగరం, (ఆంధ్రజ్యోతి): వెదుళ్లపల్లి గ్రామంలోని బొల్లి మునియ్య మెమోరియల్ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులకు రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ప్రారంభోత్సవం చేస్తారని బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు నీరుకొండ వీరన్న చౌదరి, బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ కాంపౌండ్ వాల్, సత్య బొల్లీస్ సైన్స్ ల్యాబ్, డైనింగ్ హాల్‌లను బుధవారం ప్రారంభోత్సవం చేస్తారన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పాల్గొంటారని వారు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై దీన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నిత్యావసర వస్తువుల వితరణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బత్తిన సేవా సమితి ఆధ్వర్యంలో సమితి చైర్మన్ బర్రే కొండబాబు సుబ్బారావునగర్‌లో నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సుబ్బారావు నగర్‌కు చెందిన శివకోటి రూతమ్మ కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు, చీరను స్థానిక పెద్దల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కానుబోయిన సాగర్, మరియ, గార చంటిబాబు, గారా నూకరత్నం, పిల్లా చంటిబాబు, దండు దయమ్మ, ఏనుగుపల్లి రాజమ్మ పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరికి వినతి

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోస్టాఫీసులకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు ఎంపీ పురందేశ్వరికి మంగళవారం వినతిపత్రం అందించారు. పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి మహర్షి కోరారు. కొవ్వూరులో డిగ్రీ విద్యార్థులు శాశ్వత భవనాల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోస్టాఫీసుకు కోట్ల రూపాయల విలువచేసే స్థలం మెయిన్‌రోడ్‌లో ఉందని, శాశ్వత భవనం లేక అద్దె భవనాల్లో కొనసాగుతుందన్నారు. శాశ్వ త భవనాలను నిర్మించాలన్నారు. రైల్వే హాల్ట్‌లను పునరుద్ధరించాలన్నారు.



ఆరికరేవులలో గోగులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఘనంగా అమ్మవార్ల జాతర

బిక్కవోలు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆరికరేవుల గ్రామ దేవతలుగా పూజలందుకుంటున్న గోగులమ్మ, గొల్లాలమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈయన వెంట కూటమి నేతలు రావాడ నాగు, ఇందల వీరబాబు, రెడ్డి శ్రీనివాసరావు, కొర్ల వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌టీఎస్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



పరిశోధన పత్రాల ప్రదర్శనలో శాస్త్రవేత్తలు, అధ్యాపకులు

రాజానగరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, వైద్య శాస్త్రంలో సాధించిన పురోగతిపై మండలంలో తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్, వైద్య రంగాల్లో సుమారు 66 మంది పరిశోధన వ్యాసాలు, పరిశోధన ఫలితాలను పంపించారు. కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా విధానంలో నూతన ఒరవడులను సృష్టించేందుకు అందుబాటులో ఉన్న అన్ని రకాల అవకాశాలను ఉపయోగించుకుంటే దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. వెమెన్‌లోని హెబ్రీ యూనివర్శిటీ ఆఫ్ అప్లై సైన్సెస్, సమ్మర్ఖండ్ స్టేట్ యూనివర్శిటీ ఉజికిస్థాన్, సొసైటీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఎక్సైట్ ఇండియా, ఓఎస్ఐఈటీ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో వైస్ చైర్‌పర్సన్ అనూష రెడ్డి, ప్రిన్సిపాల్ వై.రాజేశ్వరరావు, సదస్సు కన్వీనర్ రాయి ప్రసాద్, పలువురు పరిశోధన శాస్త్రవేత్తలు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు కళాకారులకు నాటక పురస్కారాలు

కడియం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి కళాసేవా సమితి ఆధ్వర్యంలో ముగ్గురు కళాకారులకు నాటక రత్న అవార్డులు ప్రధానం చేస్తున్నామని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ తెలిపారు. ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం నాటక దినోత్సవంగా గుర్తించి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బుధవారం సాయంత్రం కడియం పంచాయతి ప్రాంగణంలో కందుకూరి జయంతిని వేడుకలు నిర్వహిచడంతో పాటు ముగ్గురు కళాకారులను అవార్డులతో సత్కరిస్తామని చెప్పారు. కళాసేవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రముఖ కళాకారులు బొర్రా రామకృష్ణ, శీలం సుబ్బారావు, కొప్పిశెట్టి చిన వెంకట రావు (చంటి) లకు కందుకూరి కళారత్న అవార్డులు ప్రధానం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

నన్నయలో 22న రక్తదాన శిబిరం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టి3 ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావనను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. రక్తదాన శిబిరంలో విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్దఎత్తున పాల్గొనాలని టి3 ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, టి3 ఫౌండేషన్ ప్రతినిధులు చిట్టిప్రోలు లీలావంకర్, సుంకర ప్రసన్నకుమార్, అయ్యప్ప, శివ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



మీకు మేమున్నాం..



కూటమి నాయకులు ప్రజలతో మమేకం అవుతున్నారు.. కష్టం వచ్చిందని ఎవరైనా వస్తే అక్కున చేర్చుకుంటున్నారు.. సమస్య తెలుసుకుని పరిష్కారానికి పాటు పడుతున్నారు.. ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. అనపర్తిలో ఎంపీ పురందేశ్వరి ఒక దివ్యాంగ యువతి సమస్యలు విన్నారు.. ధవళేశ్వరం ఎమ్మెల్యే గోరంట్ల సమస్యలు విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



దొమ్మేరులో వడగళ్ల వాన



కురిసింది వాన



హైవేలో తడిచిన ధాన్యంపై బరకం కప్పుతున్న రైతులు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు అకాల కష్టం వచ్చి పడింది. చేతివరకూ వచ్చిన పంట నోటి వరకూ అందే పరిస్థితి కానరావ డంలేదు.. అకాల వర్షాలు అన్నదాతను ముంచుతున్నాయి. కొవ్వూరు పట్టణ, మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వడగళ్ల వర్షం కురిసింది. దీంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు.. రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యపురాశులు తడిచి పోవడంతో రైతులు లబో దిబోమన్నారు. సుమారు గంటకు పైగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. వర్షంతో పాటు చిన్న చిన్న ఐస్ ముక్కలు పడుతుండడంతో చిన్నారులు వాటిని చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు.



కాలువలు మూసివేస్తారా..
నీటి విడుదల పొడిగిస్తారా!

ధవళేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డెల్టా కాలువలు మూసివేస్తారా.. లేక నీటి విడుదల పొడిగిస్తారా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. రబీ అనంతరం ఖరీఫ్ సీజన్‌లో నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు క్లోజర్ పనులు చేపట్టేందుకు డెల్టా కాలువలను బుధవారం నుంచి మూసివేయాలని ఇరిగేషన్ అధికారులు గతంలోనే నిర్ణయించారు. అయితే శివారు ఆయకట్టు భూములకు ఇంకా నీటి అవసరత ఉండడం, గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడం తదితర పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. రబీ అవసరాలు తగ్గిన తరువాత గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి మరో నాలుగైదు రోజులు కాల్వలకు నీరు విడుదల చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఎటువంటి సమాచారం లేదు.

నేడు కాలువలు మూసివేస్తాం..
సర్కిల్ ఎస్ఈ గోపినాథ్

డెల్టా కాల్వలను నిర్ణయించిన తేదీ మేరకు బుధవారం నుంచి మూసివేయనున్నాం. కాల్వలకు నీటి విడుదల పొడిగింపునకు ఎటువంటి అభ్యర్థనలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇంత వరకు అందలేదు. కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేయాలని నిర్ణయించడంతో కాల్వలను మూసివేసేందుకు ఇరిగేషన్ సిబ్బంది సిద్ధంగా ఉండాలి.

ఏపీ పీజీసెట్, ఐసెట్‌కు
ఉచిత కోచింగ్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్, ఐసెట్ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తరపున ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉచిత కోచింగ్ బ్రోచర్ ఆవిష్కరించారు. పీజీ కోచింగ్ కోఆర్డినేటర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ పూర్తి సమాచారం కోసం కళాశాల అధికారిక వెబ్‌సైట్ జీసీఆర్‌జేవై.ఏసీ.ఇన్ సందర్శించాలన్నారు.

పెడితే.. తిరిగి రాధే!

"హాయ్..మీకో బెట్టింగ్ యాప్ చెబుతా.. తెలిసిన వారి ద్వారా ఇందులో పందేలు కాయిస్తే వచ్చిన లాభాల్లో 10 శాతం మీకే.. ఇదిగో యాప్ లింకు.. యూజర్ ఐడీ.. పాస్‌వర్డ్.. మీరే కాదు... మీకు నచ్చినంత మందికి ఇవి షేర్ చేసి ఎంత మందితో ఆడిస్తే అంత లాభాలు" అంటూ కాకినాడకు చెందిన మణికుమార్ అలియాస్ పండు సొంతంగా తయారుచేసిన 'రాధే' అనే బెట్టింగ్ యాప్‌తో రాష్ట్రవ్యాప్తంగా పందలాదిమంది బుకీలు, సబ్ బుకీలను నియమించుకున్నాడు.. పోలీసులకు తెలిస్తే తక్షణమే యాప్‌లో అత్యవసర బటన్ ఏర్పాటు చేశాడు.. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కోట్లు లాగేశాడు.



కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరుడు ఘాజీ (పేరు మార్చాం). గడచిన అయిదేళ్లలో కాకినాడ నగరం కేంద్రంగా పేకాట, బెట్టింగ్ యాప్‌లతో సంపాదించింది అక్షరాలా రూ.70 కోట్లు పైమాటే.. రాత్రయితే నగరంలో ప్రముఖులకు ఖరీదైన బస కల్పించి బెట్టింగ్‌లు ఆడించి తెగ నొల్లేశాడు. ప్రభుత్వం మారాక కూడా కొనసాగిస్తుండగా డెన్ బయటపడి ఇప్పుడు రహస్యంగా ఇళ్లల్లో జూదం, బెట్టింగ్ యాప్‌లు ఆడిస్తున్నాడు. అటు పండు అయినా.. ఇటు ఘాజీ అయినా వీరిద్దరి ఘరానా బెట్టింగ్ నిర్వాహకుల తెరవెనుక వెన్నుదన్ను కాకినాడ వైసీపీ కీలక నేతే. ఇటీవల పండు వరంగల్‌లో పట్టుబడితే అక్కడ మంత్రికి ఫోన్ చేసి కేసు నీరుగార్చేలా చేశాడు. - కాకినాడ/ ఆంధ్రజ్యోతి)



మనీకుమార్..మాయాజాలం

- కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా
- యాప్ తయారు చేయించి కోట్లలో జూదం
- పందేలు కట్టిస్తే లాభాల్లో 10 శాతం వాటా
- బుకీలు, సబ్‌బుకీలు నియామకం
- రాధే ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా కోట్లు
- దందాకు వైసీపీ కీలకనేత అండదండలు
- తీగలాడితే కదిలిన పండు డొంక

కాకినాడలో గతంలో ఎక్కడా బెట్టింగ్‌ల వ్యాపారం పెద్దగా జరిగేది కాదు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా బెట్టింగ్‌లు భారీగా పెరిగిపోయాయి. పై రెండు ఉదాహరణలు చాలు కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో చెప్పడానికి. ఇక్కడి నుంచే వీరిద్దరు కాకుండా అచ్చం వీళ్ల తరహాలో అనేకమంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్‌లో రమ్మీ, క్రికెట్ బెట్టింగ్, కేసినోలు ఆడిస్తూ వేలాది మంది డబ్బు జూదంలో పోగొట్టుకోగా, వీరు మాత్రం కోట్లకు పడగలెత్తారు.

బెట్టింగ్ యాప్‌ల కేరాఫ్ కాకినాడ..

తీగలాగితే డొంక కదిలింది.. కాకినాడ కేంద్రంగా సాగే బెట్టింగ్ ముఠా బయటపడింది. కాకినాడ నగరానికి చెందిన పండు ఏకంగా సొంతంగా రాధే ఎక్స్ఛేంజ్ బెట్టింగ్ యాప్ తయారుచేసి అనేక రాష్ట్రాల్లో బుకీలు, సబ్‌బుకీలను నియమించుకుని కోట్లకు పడగలెత్తాడు. ఇటీవల వరంగల్‌లో దొరికిన బెట్టింగ్ బాబులను లోతుగా విచారిస్తే కాకినాడ కేంద్రంగా పండు సాగించిన బెట్టింగ్ మాఫియా బయటపడింది. దీంతో పండును అరెస్ట్ చేసి విచారిస్తే పండు ఖాతాలో రూ.5 కోట్లు గుర్తించారు. ఇదంతా బెట్టింగ్ ద్వారా సంపాదించినదేనని తేల్చారు. తాజాగా కృష్ణా జిల్లాలోను పట్టుబడ్డ బుకీలను విచారిస్తే అక్కడా సదరు పండు పేరే బయటకు రావడంతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేయబోతున్నారు. అయితే అటు తెలంగాణ, ఇక్కడ కృష్ణాలో పట్టుబడ్డ బెట్టింగ్‌బాబులను అరెస్ట్ చేసి ప్రశ్నిస్తే కాకినాడ కేంద్రంగా వెలుగు చూస్తున్న బెట్టింగ్ దందా చూసి పోలీసులే నివ్వెరపోయి నోరెళ్లబెడుతున్నారు. దీంతో ఇప్పుడు బెట్టింగ్ యాప్‌ల తీగ లాగితే డొంక కాకినాడలో తేలుతుండడంతో పోలీసులంతా అవాక్కవుతున్నారు.

ఐదేళ్లు.. రూ.70 కోట్లు కమీషన్..

కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరులు కొందరు ఇళ్లు అద్దెకు తీసుకుని పేకాట నిర్వహించేవారు. కొన్ని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు సదరు నేత కీలక అనుచరుడు నగరంలో జూదరులకు పరిచయం చేశాడు. వారి ద్వారా ఈ యాప్‌ల్లో రోజుకు రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు కూడా పందేలు కాయించేవారు. సదరు వైసీపీ కీలకనేత అనుచరుడికి కమీషన్లు భారీగా రావడంతో రెచ్చిపోయి వ్యాపారం పెంచేశాడు. గడచిన ఐదేళ్లలో సదరు వ్యక్తి పేకాట నిర్వహణ, యాప్‌ల కమీషన్ ద్వారా రూ.70 కోట్ల వరకు సంపాదించాడు. ఇందులో రూ.14 కోట్లతో నగరంలో ఇటీవల ఖరీదైన భవంతిని నిర్మించాడు. అయితే బెట్టింగ్‌ల విషయం తెలిసినా పోలీసులు జోలికిరాకుండా ఉండేందుకు నెలకు లక్షల్లో మామూళ్లు పంపాడు. కొంతకాలం కిందట ప్రభుత్వం మారాక తిరిగి పేకాట ఆడించేందుకు ప్రయత్నించగా దొరికిపోవడంతో ఇప్పుడు యాప్‌ల ద్వారా జూదం కొనసాగిస్తున్నాడు. ఇప్పటికీ ఐపీఎల్, ఇతర క్రికెట్ మ్యాచ్‌లు వస్తే సదరు వ్యక్తి కోట్లలో యాప్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు. ఇటీవల మళ్లీ నగరంలో పలు ఇళ్లను అద్దెకు తీసుకుని యథేచ్ఛగా పేకాట, ఇతర జూదం ఆడిస్తున్నాడు. పోలీసులకు విషయం ముందే చెప్పి మామూళ్లు పంపేస్తున్నాడు.

కోట్లు 'పండు'లా రాలుతున్నాయి..

సదరు ఘాజీతో జూదంలో పరిచయాలు ఉన్న కాకినాడకు చెందిన వీరమణికుమార్ అలియాస్ పండు బెట్టింగ్‌ను వ్యాపారంగా మార్చేశాడు. కాకినాడ కేంద్రంగా రాధే ఎక్స్ఛేంజ్ బెట్టింగ్ యాప్ తయారు చేశాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తెలంగాణ వరకు ఈ యాప్‌ను అనేక మంది బుకీలు, సబ్ బుకీలకు పరిచయం చేశాడు. యాప్‌లో జూదం ఆడిస్తే వచ్చిన లాభాల్లో పది శాతం కమీషన్ ఎర చూపాడు. వీరందరికి యాప్ లింకు, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందించాడు. వీరంతా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విస్తరించేలా చేశాడు. అందులో భాగంగా తను తయారు చేసిన బెట్టింగ్ యాప్‌నకు కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కిరణ్‌కుమార్‌ను అడ్మిన్‌గా నియమించాడు. సదరు అడ్మిన్ పది శాతం కమీషన్ ఆశతో బుకీలు,సబ్ బుకీలను నియమించాడు. కిరణ్ ఇటీవల పోలీసులకు దొరికిపోడంతో పండు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. వరంగల్‌లో పోలీసులకు చిక్కిన కొందరు బుకీలు ఇచ్చిన సమాచారంతో పండు అసలు సూత్రధారుడిగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి బెట్టింగ్ యాప్ ద్వారా వచ్చిన రూ.5 కోట్ల లాభం ఖాతాలో గుర్తించారు. ఇందులో కోటితో ఇటీవల కాకినాడలో ఓ అపార్ట్ మెంట్ కొనుగోలు చేశాడు. అయితే పండు అరెస్ట్‌తో అవాక్కయిన కాకినాడ వైసీపీ కీలకనేత అక్కడ తన పాత పరిచయాలతో ఆ మంత్రితో మాట్లాడి కేసులోతుల్లోకి వెళ్లకుండా ప్రయత్నాలు చేశారు. సదరు పండు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది బుకీలతో ఇప్పటికీ జూదం ఆడిస్తున్నాడు. సదరు పండు యాప్ ద్వారా రూ.40 కోట్ల వరకు సంపాదించినట్టు సమాచారం. కానీ పోలీసులు ఇదెక్కడా పెద్దగా పట్టించుకోవడంలేదు. వరంగల్‌లో అరెస్టయిన సదరు పండును ఇక్కడా విచారిస్తే ఉమ్మడి జిల్లాలో అనేక ఘోరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ దిశగా పోలీసులు అడుగులు వేస్తారని అనుకోలేం.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి



కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగుల్లో అప్పులపాలై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు మండలం పెనకనమెట్టకు చెందిన తాడి వినోద్ (30) ఒరామి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే వర్క్ ఫ్రం హోం పనిచేస్తున్నాడు. ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లో రూ.లక్ష పోగొట్టుకోవడంతో తండ్రి వెంకటేశ్వరరావు మందలించాడు. బెట్టింగ్ గేమ్‌లలో అప్పుల పాలవ్వడంతో ఈనెల 14వ తేదీన కలుపుమందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం అక్కడ నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ బాబూరావు తెలిపారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు, రెవెన్యూ అధికారులు, రైతులు

పారదర్శకంగా భూ రీసర్వే

చిన్నాయిగూడెం అవగాహన ర్యాలీలో జేసీ చిన్నరాముడు

దేవరపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో మూడు గ్రామాల్లో రీసర్వేను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని సమగ్రంగా రీసర్వే నిర్వహించడం జరుగుతుందని జేసీ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. చిన్నాయిగూడెంలో గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీసర్వే పనులకు రైతులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రతి రైతుకు 19 నోటీసులు జారీ చేయడం జరుగుతుందని.. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వేలో అభ్యంతరాలేమైనా ఉంటే మండల సర్వేయర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చిన్నాయిగూడెంలో 5 వేల ఎకరాల భూమి ఉందని దీనిలో జమిందారుభూమి కావడం వల్ల అన్ని కోణాల్లో పరిశీలించి సర్వే చేయడం జరుగుతుందన్నారు. రైతులకు సంబంధించి 5 సెంట్లు పైబడి తేడాలుంటే సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. అడంగళ్ ,పట్టాదారు పాస్‌పుస్తకం, డాక్యుమెంట్ ఆధారాలతో రీసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతు చిలకా రాజేశ్ మాట్లాడుతూ తనకు మూడు ఎకరాలన్నర డాక్యుమెంట్ ఉందని.. భూమి ఎకరం 70 సెంట్లు మాత్రమే ఉందని రీసర్వేలో ఎక్కడుందో గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు. రైతు మాజీ ఏఎంసీ ఛైర్మన్ గడా మురళి అజిత్‌కుమార్ మాట్లాడుతూ చిన్నాయిగూడెంలో పాలేటి వాగు భూమి ఒక వైపు ఉంటే నీరు ప్రవాహం రైతు పొలాల మీదుగా వెళతుందని భూమి రీసర్వే చేసి రైతు పొలాల మీదుగా కాకుండా వాగు ద్వారా వెళ్లేలా చర్యలు చేపట్టాలని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో రీసర్వే అవగాహన ర్యాలీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ నారాయణ, ఐఎస్‌వో వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్,సర్పంచ్ డి.జ్యోతిరాణి, రైతులు పిన్నమనేని మధుమోహన్, అబ్బిన సురేంద్ర, గడా రామనరసింహారావు, కాట్రగడ్డ శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ పాడారు.. ఇక్కడ ఇచ్చేశారు!

భూ వేలంలో మాయాజాలం

రాజానగరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అన్నదాన సత్రం భూముల్లో పంటల సాగు బహిరంగ వేలంలో పలువురు సిండికేట్ అయ్యారు.రాజానగరంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన(ఫీడింగ్)సత్రం అధీనంలో తూర్పుగోనగూడెంలో ఉన్న 25.16 ఎకరాల్లో పంటలు పండించుకునేందుకు దేవాదాయ ధర్మాదాయ తనిఖీదారు టీవీఎస్ఆర్ ప్రసాద్, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు గ్రామ పెద్దలు, పాటదారుల సమక్షంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. 25.16 ఎకరాలను ఐదు బిట్లుగా బహిరంగ వేలం నిర్వహించారు. సర్వే నంబరు 20లో ఉన్న 2.87 ఎకరాలు భూమిలో పంట సాగుకు సాలుకు లక్షా వెయ్యి రూపాయలు,సర్వే నెంబరు 27లో 5.48 ఎకరాలు రూ.లక్షా 5 వేలుకు, సర్వే నెంబరు 28లో 6.99 ఎకరాలను రూ.లక్షా 30 వేలకు, సర్వే నెంబరు 135లో ఉన్న 4.91 ఎకరాలను రూ.90 వేలకు రాజానగరానికి చెందిన గుర్రం శ్రీనివాసరావు పాడుకున్నారు. సర్వే 135లో ఉన్న మరో 4.91 ఎకరాలను సూర్యారావుపేటకు చెందిన పిడుగు సురేష్ రూ.90 వేలకు దక్కించుకున్నారు. దీంతో 25.16 ఎకరాలు ఏడాదికి రూ.5.16 లక్షలు వంతున మూడేళ్ల పాటు పంటలు పండించుకునేందుకు మొత్తం రూ.15.48 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో సురేష్‌బాబు తెలిపారు. బహిరంగ వేలంలో రూ.15.16 లక్షలు వంతున పాడుకున్న కూటమి నాయకులు సిండికేట్‌గా మారి సాలుకు 11 లక్షలు వంతున ఇతర వ్యక్తులకు కట్టబెట్టి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు వైసీపీకి చెందిన నాయకులు ఆరోపించారు.

ధాన్యం తక్కువ ధరకు అమ్మవద్దు

ఎంపీ పురందేశ్వరి

బిక్కవోలు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మి రైతులు పోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి రైతులకు సూచించారు.కొమరిపాలెం రైతు సేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించిన విధంగా త్వరలో బిక్కవోలు రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రూ.6 కోట్లతో కెనాల్ రోడ్ మరమ్మతు పనులు చేపట్టామని, మరో రూ.4.50 కోట్లతో పనులు చేపడతామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అన్ని వర్గాలు ఆనందంగా ఉన్నాయన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎంపీపీ తేతలి సుమ, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, శివరామకృష్ణంరాజు, చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వెదుళ్లపల్లి సొసైటీలో విచారణ మాటేమిటి

సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో నిలదీసిన రైతులు

సీతానగరం,ఏప్రిల్ 15 : వెదుళ్ళపల్లి సొసైటీలో అవినీతిపై విచారణ ఎంత వరకు వచ్చిందని రైతులు ప్రశ్నించారు. సీతానగరం మండలం వెదుళ్ళపల్లి సహకారం సంఘం సర్వసభ్య సమావేశంలో మంగళవారం రైతులు మాట్లాడారు. 2018 ఏప్రిల్ నుంచి సంఘంలో ఆడిట్ చేసిన అధికారులు దుర్వినియోగమైన నగదుపై విచారణాధికారులుగా వద్దని కొత్తవారిని నియమించాలని తీర్మానించారు. గతంలో అవినీతికి పాల్పడిన సీఈవో సురేంద్ర, గుమస్తా పోశియ్య, భారతిలను సస్పెండ్ చేసి ఎరువుల అమ్మకాల్లో అవినీతికి పాల్పడిన భారతిని ఇప్పుడెలా విధుల్లోకి తీసుకున్నారని ప్రశ్నించారు. రుణాలు చెల్లించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలి కదా .. విచారణ సాగదీస్తుంటే రైతులకు న్యాయమెలా జరుగుతుందంటూ కరుటూరి విశ్వనాథం, పెందుర్తి రాజా, పెందుర్తి బుజ్జియ్య చౌదరి ప్రశ్నించారు.సహకార సంఘం అధ్యక్షుడు ఎం సోమయ్య మాట్లాడుతూ సిబ్బంది జీతాలు అంత ఎక్కువగా ఎందుకు పెంచారని ప్రశ్నించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మాట్లాడుతూ సంఘంలో 400 మంది సభ్యులు ఉన్నారని అందులో 45 మంది రైతులు తీసుకున్న రుణాల చెల్లింపులో నకిలీ రసీదులు సస్పెండైన అప్పటి సీఈవో ఇచ్చారని దీనిపై రూ 14 లక్షలు దుర్వినియోగమైనట్టు తేలిందన్నారు. విచారణ గడువు వచ్చే నెల 12వ తేదీ వరకు ఉందన్నారు. గతంలో రూ.64 లక్షలు దుర్వినియోగం తిరిగి రూ.57 లక్షలు చెల్లించారని ఇంకా రూ.7 లక్షల చెల్లించాల్సి ఉందన్నారు. రైతులకు అందించిన నకిలీ రసీదులపై రికార్డులు పరిశీలించగా రూ.14 లక్షలు దుర్వినియోగమైనట్టు గుర్తించామని.. ఇంకా రైతుల రుణాల చెల్లింపులపై విచారణ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విచారణాధికారి శివ కుమార్, ఆడిటర్ కె.సుబ్బారావు ,సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 8 నుంచి 14 సంవత్సరాల వయసున్న 25 మంది బాలురు, 25 మంది బాలికలకు వివిధ క్రీడాంశాల్లో వేసవి క్రీడాశిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రీడా శిక్షణా శిబిరాలు మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఆసక్తికల్గిన క్రీడాకారుల దరఖాస్తులను ఆయా క్రీడల జిల్లా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామోపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు అందజేయాలని కోరారు. గురువారంలోపు రాజమహేంద్రవరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయానికి నేరుగా కానీ, ఈమెయిల్ ద్వారా కానీ పంపించాలన్నారు. వివరాలకు సెల్ 90329 34038లో సంప్రదించాలన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

చాగల్లు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బాలికను నమ్మించి మోసగించిన యువకుడిని అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. బ్రాహ్మణగూడెంనకు బాలిక (15)పై అదే గ్రామానికి చెందిన శీలం సిద్దార్థ చంద్ర అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసినట్టు బాధితురాలి తల్లి ఈ నెల 10వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు చాగల్లు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు శీలం సిద్ధార్థ చంద్రను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు.

17న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని ప్రజల గోడు వినేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈనెల 17న రాజమహేంద్రవరం రానున్నారని జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని అల్యూమినియం కాలనీ, తాడితోట, వీరభద్రనగర్, రైతునగర్, ఆదెమ్మదిబ్బ, శేషయ్యమెట్ట ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించి ఇళ్లులేని పేదలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ 17న రాజమహేంద్రవరం వస్తున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను కలసి పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై మాట్లాడతారన్నారు. అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదల సమస్యలు, వారి బాధలను ఇప్పటికే తాము తెలుసుకున్నామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, నగర కార్యవర్గ సభ్యులు పి.లావణ్య, త్రిమూర్తులు, రామరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం


కొవ్వూరులో విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి ఏవీఎస్ ఎన్‌ఎస్ వేణు తెలిపారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గ్యాస్ సిలెండర్ వెలిగించి మంటలు ఆర్పడంపై అవగాహన కల్పించారు. అనంతరం సీవో2, ఫోమ్‌ను ఉపయోగించి మంటలను ఆర్పడంపై డెమో నిర్వహించారు. అనంతరం విజయవిహార్ సెంటర్ నుంచి బస్టాండ్ మీదుగా మెరకవీధి వాటర్ ట్యాంకు, రైల్వేస్టేషన్ సెంటర్లలో కరపత్రాలు పంపిణీ చేసి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరికి పీడీఎస్‌యూ నాయకుల వినతి


పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోస్టాఫీసులకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి మహర్షి ఆమెను పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మహర్షి మాట్లాడుతూ కొవ్వూరులో డిగ్రీ విద్యార్థులు శాశ్వత భవనాల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోస్టాఫీసుకు కోట్ల రూపాయల విలువచేసే స్థలం మెయిన్‌రోడ్‌లో ఉందని, శాశ్వత భవనం లేక అద్దె భవనాల్లో కొనసాగుతుందన్నారు. శాశ్వత భవనాలను నిర్మించాలన్నారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌ల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని అలాగే అన్ని డిపోల ఎక్స్‌ప్రెస్ బస్సులు పట్టణంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.భూషణం, కమిటీ సభ్యులు బి.వినోద్ తదితరులు ఉన్నారు.

కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్స్


మహిళలకు సర్టిఫికెట్స్ అందిస్తున్న సినీ నాటుడు బాలాజీ

నల్లజర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పార్డు ఇండియా సంస్థలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు సినీ నటుడు బాలాజీ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందించారు. మంగళవారం నల్లజర్లలో పార్డు ఇండియా కార్యాలయంలో అక్టోబరు 2014 నుంచి జనవరి 2025 వరకు శిక్షణ పొందిన 55మంది మహిళలకు సర్టిఫికెట్స్ అందించినట్టు సంస్థ జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ చైర్మన్ బొందల శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్టిఫికెట్స్ ఆధారంగా ప్రభుత్వ రుణ సహాయంతో స్వయం ఉపాధి పొంది మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో కూరపాటి నాగారాజు, చీమకుర్తి ప్రసాద్, పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలకు ఆరోగ్యం


నెలటూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

చాగల్లు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం, కాలుష్య రహిత సమాజం కోసం ప్రకృతి వ్యవసాయం చేయడమే మంచిదని ప్రాజెక్టు డిప్యూటీ మేనేజర్ తాతారావు అన్నారు. మంగళవారం నెలటూరులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులు కొడమంచిలి సుధాకర్, జి రామ దుర్గారావులను సన్మానించారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహిస్తోందని, భవిష్యత్‌లో అందరు తప్పనిసరిగా అనుసరించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీతభత్యాలపై సీఎం అడిషనల్ సెక్రటరీకి ఓపీడీఆర్ కమిటీ వినతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరు లిమిటెడ్ పరిశ్రమ ఉద్యోగుల, కార్మికుల జీతభత్యాల పెంపుదల సమస్యను ప్రభుత్వం వెంటనే న్యాయబద్ధంగా పరిష్కరించాలని ఓపీడీఆర్ సంఘీభావ కమిటీ ముఖ్యమంత్రి అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రాకు విన్నవించారు. ఈ మేరకు కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. మిల్లు కార్మికులకు, ఉద్యోగులకు 2020 జూలై 1 నుంచి జీతభత్యాలు పెంచాల్సి ఉందని, కాని యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, నిరంకుశ విధానాల వల్ల నాలుగేళ్లకు పైగా కాలం గడిచినా తమ సమస్య అపరిష్కృతంగానే ఉందన్నారు. సమస్య పరిష్కార బాధ్యతను అడిషనల్ సెక్రటరీకి సీఎం అప్పగించారని ఈ సందర్భంగా ఓపీఆర్‌డీ ఆధ్వర్యంలో వివిధ కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు రాజమండ్రి పేపరుమిల్లు కార్మికుల హక్కుల సంఘీభావ కమిటీగా ఏర్పడి సమస్యకు సంబంధించిన వివరాలను, వాస్తవాలను కార్మికులు, ఉద్యోగులు వారి సంఘాల నుంచి సేకరించి కార్తికేయ మిశ్రాను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఓపీఆర్‌డీ సంఘీభావ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.రవీంద్రప్రసాద్, ఫ్యాప్టో నేత జేవీవీఎస్ఎన్ రాజు, ఆంధ్ర పేపరు మిల్స్ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఏవీవీ శ్రీనివాస్, డీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి కె.రాంబాబు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న అంబులెన్స్

ముగ్గురికి స్వల్ప గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన అంబులెన్స్

దేవరపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నుంచి అంబులెన్స్‌లో పేషెంట్‌ను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మండలంలోని దుద్దుకూరు హైవే వద్ద ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం 6గంటలకు ముందుగా వెళ్తున్న లారీని అంబులెన్స్ ఢీకొనడంతో అంబులెన్స్ డ్రైవర్‌కు, పేషెంట్‌కు, పేషెంట్ బంధువుకు, స్వల్పగాయాలయ్యాయి. దీంతో వారిని మరో అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో మహేశ్వరికి బైపీసీలో ప్రథమ స్థానం



కడియం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కడియం ఏవీఆర్ జడ్పీ హైస్కూల్ ప్లస్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ బైపీసీలో విద్యార్థి జ్యోతుల మహేశ్వరి 954 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే 934 మార్కులతో సత్యవాడ ఝాన్సీ ద్వితీయ స్థానంలో నిలిచింది. సీఈసీ చదువుతున్న కె.నాగదేవి 748 మార్కులు, సువర్ణశిరీష 658 మార్కులు సా ధించారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని ఘనంగా సత్కరించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

గోగులమ్మ, గొల్లాలమ్మ జాతర

బిక్కవోలు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆరికరేవుల గ్రామ దేవతలుగా పూజలందుకుంటున్న గోగులమ్మ, గొల్లాలమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈయన వెంట కూటమి నాయకులు రావాడ నాగు, ఇందల వీరబాబు, రెడ్డి శ్రీనివాసరావు, కొర్ల వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టాలను ఎలా అధిగమించాలో చెప్పాలి

- ఎంపీపీ కేవీకే దుర్గారావు
- 'ప్రకృతి విపత్తులు, రిస్క్ మేనేజ్‌మెంట్' మండలస్థాయి అధికారులకు శిక్షణ


దేవరపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన విపత్తుల గురించి మనమేమి నేర్చుకున్నామో, నష్టాలను ఎలా అధిగమించాలో, తీసుకోవల్సిన చర్యలను ప్రజలకు వివరించాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు చెప్పారు. ప్రకృతి విపత్తులు, రిస్క్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకృతి విపత్తుల వలన జరిగే నష్టాన్ని అవి రాకుండా ఎలా అడ్డుకోవాలని వస్తే ఎలా నివారించాలని అధికారులతో చర్చించడం వల్ల ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం ఏవిధంగా ఎదుర్కొంటుందో, అధికారులు సహాయక చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, ఈవో పీఆర్‌డీ వై.రాజారావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి విపత్తులను అంచనా వేయడం, నష్టాన్ని తగ్గించడం విపత్తు నుంచి సంభవించే నష్టాలను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవడంపై రెవెన్యూ తదితర సంబంధిత శాఖాధికారులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీగా పశుసంవర్ధక శాఖ ఏడీ రవివర్మ వ్యవహరించారు. ఈ అవగాహనా సదస్సులు మూడు రోజుల పాటు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జహన్, ఏవో రుచిత పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంటు అథారిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులను తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ప్రారంభించారు. వరదలు, తుఫాను ప్రకృతి వైపరీత్యాలు జరిగిన తీసుకోవలిసిన జాగ్రత్తలపై శిక్షణ అందించారు. ఇక్కడ శిక్షణ పొందిన అధికారులు సచివాలయ సిబ్బందికి శిక్షణ అందిస్తారన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ ఎన్ఎస్ వేణు, ఈవోపీఆర్డీ టీవీఎస్ఎన్‌కేఎస్ఎస్ ప్రకాశరావు, విద్యుత్‌శాఖ ఏఈ డి.జగదీశ్వరరావు, సీఐ పి.విశ్వం, ఏవో ఎ.గంగాధర్, ఏజీ ఆర్‌బీ ఏఈ జి.మణికంటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై మండలస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొవ్వూరుకు చెందిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.సందీప్, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, ఏవో విశ్వాసరావు, ఈవోపీఆర్డీ కె.ఆంజనేయశర్మ తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో మాట్లాడుతున్న పీఆర్ డీఈఈ కృష్ణనాయక్



కొవ్వూరులో మాట్లాడుతున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్

ప్రమాదకరంగా క్వారీ గోతులు

- కొవ్వూరు వైస్ ఎంపీపీ నారాయుడు
- దేచర్లలో గ్రానైట్ అండ్ మెటల్స్ సంస్థ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ


సభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నారాయుడు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): క్వారీ గోతులులో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతూ ప్రమాదకరంగా తయారయ్యాయని కొవ్వూరు వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు అన్నారు. కొవ్వూరు మండలం దేచర్లలో మెస్సర్స్ వరలక్ష్మి గ్రానైట్ అండ్ మెటల్స్ సంస్థ ఏర్పాటుపై మంగళవారం ఆర్డీవో రాణి సుస్మిత ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా క్వారీలు ఏర్పాటుకు నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాల నిర్వహణ స్థానిక గ్రామాల ప్రజలకు తెలియజేయడం లేదని పలువురు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నారాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో క్వారీలకు పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించకుండా క్వారీలు ఏర్పాటు చేస్తున్నారని, గ్రామేతరులను, పనికి ఆహార పథకం కూలీలను సమావేశాలకు తరలించి దళారులు ప్రలోభ పర్చి తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నారు. గోతులను పూడ్చకుండా వదిలివేయడంతో నీరు నిలిచి దుర్వాసన వస్తోందని, గోతుల్లో మనుషులు, పశువులు పడి మృత్యువాత పడుతున్నారని, గోతులను పూడ్చించాలన్నారు. క్వారీలు, క్రషర్ల వల్ల పంగిడి, దేచర్ల, గౌరీపట్నం, దుద్దుకూరు గ్రామాల్లో వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. పంగిడిలో కల్యాణ మండపం నిర్మించాలన్నారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అవసరమైన ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. దుమ్ము గాలిలో ఎగరకుండా వాటరింగ్ చేయించాలన్నారు. క్వారీల చుట్టూ మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. క్వారీ కార్మికులకు బీమా చేయించాలన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు 25 మంది నుంచి మౌఖికంగాను, ఏడుగురు రాత పూర్వకంగా అభిప్రాయాలు అందించారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, పర్యావరణ ఇంజనీరు శంకరరావు, క్వారీ అండ్ క్రషర్ అసోసియేషన్ నాయకులు, యజమానులు పాల్గొన్నారు.

ప్రయోజనకరమైన ప్రాజెక్టులు చేయాలి

డీఆర్‌డీవోలోని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబొరేటరీ శాస్త్రవేత్త-ఎఫ్ వీరబ్రహ్మం


వీరబ్రహ్మంను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ అధ్యాపకులు భవిష్యత్ సమాజానికి ప్రయోజనకరమైన ప్రాజెక్టు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, పరిశ్రమలతో అనుసంధానమై ప్రాజెక్టులు నిర్వహించాలని హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబొరేటరీ శాస్త్రవేత్త-ఎఫ్ కె.వీరబ్రహ్మం అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని సైన్స్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులకు మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వివిధ సంస్థ నుంచి విశ్వవిద్యాలయానికి సీఎస్ఆర్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పరిచే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధ్యాపకులకు సూచించారు. ప్రస్తుత కాలంలో కృత్రిమమేధలో వైద్య, పారిశ్రామిక రంగాలకు ఎక్కువ డిమాండ్ ఉండే అవకాశం ఉందని, అధ్యాపకులు వాటిపై దృష్టి సారించాలని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్‌సైన్స్, మెకానికల్ వంటి అంశాలపై ఎక్కువ అవగాహన పెంచుకోవాలన్నారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ అన్ని విభాగాలు వినూత్న ఆలోచనలతో విశ్వవిద్యాయాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రాజెక్టులు నిర్వహించాలన్నారు. అనంతరం వీరబ్రహ్మంను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులతో ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య పి.సురేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన యువకుల

మృతదేహాలు లభ్యం


మృతులు గంధం హర్ష, మట్టి ప్రకాష్

కొవ్వూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గోదావరిలో గల్లంతయిన ఇద్దరు యువకుల మృతదేహాలను మంగళవారం లభ్యమయ్యాయి. నిడదవోలుకు చెందిన మట్టి ప్రకాష్(14), ఉసురుమత్తి రత్నదీప్ అలియాస్ వెస్లీ, రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష(17) ఈ నెల 14న గోదావరిలో స్నానానికి కొవ్వూరు మండలం సీతంపేట పంచాయతీ పరిధిలోని చిగురులంక వెళ్లారు. నది లోతు తెలియక మునిగిపోతుండగా అక్కడే ఉన్న పిల్లి దివాకర్ చూసి రత్నదీప్‌ను రక్షించారు. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో గాలింపు చర్యలను పర్యవేక్షించారు. నదిలోతు ఎక్కువగా ఉండడంతో మంత్రి ఆదేశాల మేరకు కాకినాడ నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించారు. అర్ధరాత్రి 1గంట సమయంలో రెండు మృతదేహాలను వెలికితీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మట్టి ప్రకాష్ తండ్రి కిషోర్‌బాబు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.

22న నన్నయలో రక్తదాన శిబిరం

ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీ3 ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ రక్తదాన శిబిరంలో విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొనాలని టీ3 ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, టీ3 ఫౌండేషన్ ప్రతినిధులు చిట్టిప్రోలు లీలాశంకర్, సుంకర ప్రసన్నకుమార్, అయ్యప్ప, శివ, జగదీశ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్ల పంపిణీ



ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్లు అందిస్తున్న ఏఎస్పీ, అగర్వాల్ ఎండీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ కళ్లజోళ్లను పంపిణీ చేసారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, అర్జున్, చెంచిరెడ్డిలతో కలిసి 300 మందికి కూలింగ్ కళ్లజోళ్లను డాక్టర్ అగర్వాల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సత్తి విజయ్ అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ అగర్వాల్ సంస్థ దేశంలోనే అత్యధిక బ్రాంచ్‌లు ఉండి మంచి పేరున్న ఆసుపత్రి అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, కార్యంశెట్టి జయకుమార్ రెడ్డి, అఖిల్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై దాడి, వ్యక్తి అరెస్ట్

రంగంపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామంలో మంగళవారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ ఎస్ఐ వై.దుర్గాప్రసాద్ తెలిపారు. గుబ్బల అప్పారావు వద్ద 8 మద్యం సీసాలు కలిగి ఉన్నందున ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిధుల దుర్వినియోగం

ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కర పనుల్లో నిధులు దుర్వినియోగం ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంటు అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా కొవ్వూరు మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. కొవ్వూరు మున్సిపాల్టీలో పుష్కర నిధులతో చేపట్టిన గోదావరి బండ్ సుందరీకరణ పనుల్లో నిధులు దుర్వినియోగంపై విచారణ అనంతరం జరిమానా కింద అప్పటి మున్సిపల్ ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన పీవీ ప్రభాకరరావు, రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వైవీ నరసింహరావు పింఛను నుంచి 3శాతం ఒక సంవత్సరం పాటు నిలుపుదల చేయాలని, అలాగే రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ బి.శ్రీధర్ పింఛను నుంచి 3 శాతం రెండేళ్ల పాటు నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

కాల్దరిలో రక్తదాన శిబిరం

రక్తదానం చేసిన 18 మంది దాతలు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్దరి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మంగళవారం కాల్దరి చైతన్యయూత్, రెడ్‌క్రాస్ సంస్థ తణుకు శాఖ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ చీపుళ్ల కుమారి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు యువత నడుచుకోవాలన్నారు. 18మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ ఆర్గనైజర్ అమిరపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో రక్తదానం చేసిన దాతలకు రెడ్‌క్రాస్ సంస్థ సర్టిఫికెట్లు అందజేసింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ ఇన్‌చార్జి సూర్య, టెక్నీషియన్ పవన్, కమిటి నాయకులు కొండేపూడి శ్రీను, చీపుళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీయూలోకి కార్మిక నాయకుడు జోజి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): గత 30ఏళ్లుగా రాజమహేంద్రవరం కేంద్రంగా క్వారీ కార్మిక, సామిల్లు వర్కర్స్, గ్యాస్ డెలివరీ వర్కర్స్ సంఘాల నాయకుడిగా పనిచేసిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కె.జోజి ఆ పార్టీకి రాజీనామా చేసి ఏఐఎఫ్‌టీయూలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక క్వారీ సెంటర్ సమీపంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జోజి ఏఐఎఫ్‌టీయూలో చేరారు. ఈ సందర్భంగా జోజి మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని తీవ్రంగా నష్టపరుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న పోరాటాల్లో కార్మిక వర్గం అంతర్గత సమస్యలు ప్రక్షాళన చేసుకుని పటిష్టమైన ఐక్యతను సాధించాలన్నా రు. అనంతరం ఈనెల 22న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే వీఐ లెనిన్ జయంతి కార్యక్రమాలు, సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్, ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకుడు కొండ దుర్గారావు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.